# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | ఆదివారం-21-సెప్టెంబర్-2025 | సంపుటి : 3 | సంచిక : 116 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## న్యాయవ్యవస్థ మౌలిక, సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- సీఎం రేవంత్ రెడ్డి
- కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు, సిబ్బంది నియామకాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచనలు
- అవసరమైన ప్రతిపాదనలకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి హామీ

హైదరాబాద్,సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో న్యాయవ్యవస్థను బలోపేతం చేసేందుకు మౌలిక సదుపాయాల కల్పన, సిబ్బంది నియామకాలపై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు.కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు నిర్మించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, సిబ్బంది నియామకాలు చేపట్టాలని జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సూచించారు. ఈ అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను

మిగతా 2లో



# ప్రతిష్టాత్మకంగా మేడారం జాతర అభివృద్ధి



సంప్రదాయాలకు భంగం కలగకుండా ఆదేశాలు

పూజారుల సూచనలతోనే డిజైన్‌లు విడుదల చేయాలని సీఎం రేవంత్ స్పష్టం

ఈ నెల 23న మేడారం సందర్శన చేసి క్షేత్రస్థాయిలో సమీక్ష

హైదరాబాద్,సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు):

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన సంప్రదాయ శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మేడారం అభివృద్ధి ప్రణాళికలపై పూజారుల సూచనలతో డిజైన్‌లు రూపొందించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, లోక్‌సభ సభ్యుడు పోరిక బలరాం నాయక్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర అభివృద్ధి పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ గిరిజన

మిగతా 2లో



## పార్టీలు మారడంలో కడియం ఐకాన్!

- అవి ప్రొసీడింగ్ కాపీలు కాదు.. చిత్తుకాగితాలు
- 30 ఏళ్లుగా కడియం ప్రజలను మోసం చేస్తున్నట్లు ఆరోపణలు
- ఉపకాలువలు పూర్తి కాలేక రైతులు తీవ్ర ఇబ్బంది
- అభివృద్ధి పై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్
- మాజీ డిప్యూటీ సిఎం రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్,,సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు):

మోసాలు చేయడంలో కడియం ఐకాన్.. పార్టీ మార్పుల్లో ఐకాన్ నమ్మించి మోసం చేయడంలో ఐకాన్.. గ్లోబల్ ప్రచారంలో ఐకాన్ కార్యకర్తల ఉసురు తీసుకోవడంలో ఐకాన్.. కానీ ఫ్లైఓవర్ బ్రిడ్జి, కాళోజి హెల్త్ యూనివర్సిటీ, జనగామ జిల్లా ఏర్పాటులో రాజన్న ఐకాన్.. తెలంగాణ కోసం రాజీనామా చేసి త్యాగం చేశాను. రాష్ట్రంలో అభివృద్ధిలో కెసిఆర్ నెంబర్ వన్, 2వ స్థానంలో కేటీఆర్, 3వ స్థానంలో హరీశ్ రావ్,

మిగతా 2లో





## రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క

హైదరాబాద్,సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనంగా, సాంప్రదాయ సౌందర్యానికి ప్రతి రూపంగా, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా జరుపుకునే పూల పండుగ బతుకమ్మ సందర్భంగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి,

మిగతా 2లో


## తెలంగాణ లో 9 గుర్తింపులేని రాజకీయ పార్టీలు రద్దు

హైదరాబాద్, సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు): :

తెలంగాణలో 9 రాజకీయ పార్టీలను ఎన్నికల సంఘం రద్దు చేసింది. రాష్ట్రంలో నమోదైన 9 గుర్తింపు లేని రాజకీయ పార్టీలను రద్దు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. చట్టపరమైన నిబంధనలు పాటించకపోవడంతో డీలిస్టింగ్ చేసినట్లు పేర్కొన్నారు. రద్దయిన పార్టీల్లో ఆల్ ఇండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ, ఆల్ ఇండియా బీసీ ఓబీసీ పార్టీ, బీసీ భారత దేశం పార్టీ, భారత్ లేబర్ ప్రజా పార్టీ, లోక్‌సత్తా పార్టీ, మహాజన మండలి

మిగతా 2లో



## భారతదేశం యువరక్తంతో ఉరకలెత్తుతోంది

` జెన్ జెడ్ శక్తిని తక్కువ అంచనా వేయొద్దు..

` ప్రభుత్వానికి కేటీఆర్ హెచ్చరిక

హైదరాబాద్,సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు):

యువత ఆకాంక్షలను ప్రభుత్వాలు విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మౌలిక భావోద్వేగాలను రెచ్చగొడుతూ, మందిర్-మజీద్, ఎవరు ఏం తింటున్నారు? ఎవరేం కట్టుకుంటున్నారన్న అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడంలో ప్రధాని మోదీ విజయం సాధించారని ఆరోపించారు. దేశ భవిష్యత్తుకు కీలకమైన అభివృద్ధి, ఆవిష్కరణలను మోదీ గాలికొదిలేశారని విమర్శించారు. చైనా, జపాన్, అమెరికా వంటి పశ్చిమ దేశాలతో పోటీపడి వారిని అధిగమించే ప్రయత్నం చేయాలే తప్ప, మనకన్నా వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తి చెందడం సరికాదని హితవుపలికారు.

శనివారం ముంబైలో జరిగిన (జెన్-జీ) సదస్సులో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జెన్-జీ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర వంటి అంశాలపై తనదైన శైలిలో అద్భుతంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రస్తుత తరం యువత (జెన్-జీ) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దని కేటీఆర్ సూచించారు.

మిగతా 2లో

## కుమార్తెను హతమార్చిన తండ్రి

- భార్యపై కోపంతో క్షణికావేశంలో 12 నెలల వయసున్న కుమార్తెను హతమార్చిన తండ్రి
- సూర్యాపేటలో ఘటన

2లో



## నిర్లక్ష్యం వహించకూడదు

- ఎండోమెంటు ప్లీడర్ల పనితీరుపై మంత్రి సురేఖ తీవ్ర అసంతృప్తి
- దేవుడి భూములపై లీగల్ ఫైట్ సరిగా చేయండి

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రతిష్టాత్మకంగా మేడారం జాతర అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)



సంప్రదాయాలకు భంగం కలగకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. సమ్మక్క సారలమ్మ పూజారులను సంప్రదించి, వారి ఆమోదంతోనే డిజైన్‌లు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ఆలయ ఆవరణ విస్తరణ, అమ్మవార్ల గద్దెలను యథాతథంగా ఉంచడం, సంప్రదాయాన్ని ప్రతిబింబించే స్వాగత తోరణాల రూపకల్పనపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో స్థానిక సంప్రదాయ వృక్షాలను నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 23న మేడారంలోనే మంత్రులు, గిరిజన ప్రజా ప్రతినిధులు, అధికారులు సమక్షంలో అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

## రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క

(మొదటి పేజీ తరువాయి)



మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ పండగ శుభాకాంక్షలు తెలిపారు. మన తల్లులు, అక్కాచెల్లెళ్లు భక్తి శ్రద్దలతో అలంకరించే బతుకమ్మలు కేవలం పూల సమాహారమే కాదు... అవి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సామూహిక జీవన సౌందర్యానికి సజీవ రూపమని పేర్కొన్నారు. బతుకమ్మ పూలతో ప్రకృతిని ఆరాధించడం, గౌరమ్మను సత్కరించడం, సోదరీమణులు కలసి పాడుతూ, ఆడుతూ జరుపుకోవడం తెలంగాణ సంస్కృతి ప్రత్యేకతను ప్రతిబింబిస్తాయన్నారు. బతుకమ్మలో ఉపయోగించే ప్రతి పువ్వుకీ ప్రత్యేకమైన ఔషధ గుణాలు ఉంటాయని...తిరొక్క పూలతో ప్రకృతి మాతకు కృతజ్ఞత చాటే పండగ బతుకమ్మ అని కొనియాడారు. ఈ బతుకమ్మ పండుగ ప్రతి ఇంటిని సంతోషాలతో నింపాలని, మన తెలంగాణ తల్లికి మరింత కీర్తి చేకూర్చాలని ఆకాంక్షించారు.

## న్యాయవ్యవస్థ మౌలిక, సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



(మొదటి పేజీ తరువాయి)

ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, న్యాయవ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రాధాన్యత క్రమంలో కోర్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు సిబ్బంది నియామకాలను చేపడతామని హామీ ఇచ్చారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన ఈ సమావేశంలో జస్టిస్ సామ్ కోశి, జస్టిస్ అభినంద్ కుమార్ శావిలి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు, అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వహించకూడదు



(మొదటి పేజీ తరువాయి)

శనివారం రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి పేషీలో ఎండోమెంటు గవర్నమెంటు ప్లీడర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ ఎండోమెంటు కేసుల విషయంలో న్యాయవాదులతో ప్రతి ఆరు నెలలకొకసారి సమావేశం పెట్టి స్టేటస్ చెప్పాలని ఎండోమెంటు శాఖ అధికారులను ఆదేశించారు. దేవుడి భూములు కబ్జా చేస్తే పీడీ యాక్టు పెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి నొక్కి చెప్పారు. ఎండోమెంటు భూముల అన్యాక్రాంతానికి సంబంధించి కేసుల పురోగతిని మంత్రి సమీక్షించారు. దేవుడి భూములు కాపాడటంలో ఎందుకు జాప్యం జరుగుతుందని నిలదీశారు. తన ముందు వాదించినట్టు ఇక్కడ కోర్టులో వాదించలేక పోతున్నారని మంత్రి అడిగారు. ఈ సమావేశంలో ఎండోమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, యాదగిరిగుట్ట ఈవో వెంకటరావు, కమిషనర్లు క్రిష్ణ ప్రసాద్, క్రిష్ణవేణి, ఎండోమెంటు శాఖ గవర్నమెంటు ప్లీడర్ (జీపీ) బీఎం నాయక్, ఏజీపీ శైలజ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. దేవుడి భూములు కాపాడటంలో లీగల్ టీం పాత్ర చాలా కీలకమైందని మంత్రి సురేఖ పేర్కొన్నారు. తాను దేవాదాయ శాఖ మంత్రి అయి రెండు సంవత్సరాలు అయిందని ఇప్పటికీ కేసులు ఏం గెలిచామో తెలియడం లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే, ఇప్పటివరకు ఎన్ని కేసులు గెలిచామో వివరించాలని చెప్పారు. అసలు కేసుల విషయంలో అప్డేట్ కోసం అడిగితే డిపార్టుమెంటులో ఎవరు చెప్ప లేకపోవడం న్యాయ విభాగం అప్‌డేట్ చేయకపోవడం ఏంటని మంత్రి ప్రశ్నించారు. మన దేవుడి భూములు మనం దక్కించుకోవాలన్నారు. దూరదృష్టితో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఏ కేసుల మీద న్యాయ పోరాటం చేశారో... వాటిని పరిష్కరించడంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురయ్యాయో మంత్రి సురేఖ న్యాయ వాదులను అడిగారు. అయితే, మంత్రి ప్రశ్నకు సమాధానంగా 2002 నుంచి 2025 వరకు 1,500 కేసులు పెండిరగులో ఉన్నాయని తెలిపారు. ఈ కాల వ్యవధిలో 543 కోర్టు కేసులను డిస్పోజ్ చేసినట్టు ప్రభుత్వ ప్లీడర్లు వివరించారు. కేసుల్లో పురోగతికి సంబంధించిన అంశాలు, జడ్జిమెంట్ కాపీ ఎండోమెంటు శాఖ సెక్రటరీకి అందజేయాలని సూచించారు. ఎండోమెంటు డిపార్టుమెంటుకు సంబంధించిన కేసుల్లో రిట్ పడిన దగ్గరి నుంచి కేసు పూర్తయ్యేవరకు ఎలా ముందుకు వెళుతున్నది వివరించాలని చెప్పారు. ఎండోమెంటు కేసుల్లోని కంటెప్ట్ ఆఫ్ కోర్టు అంశాలు తీవ్రంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. వీటి విషయంలో గౌరవ హైకోర్టులను పిలిచేదాకా ఎందుకు తీసుకెళ్ళాలని మంత్రి అడిగారు. ఈ విషయంలో న్యాయ విభాగ టీం, వారి కింద వ్యవస్థ సరైన టైంలో ఎండోమెంటు ఉన్నతాధికారులను అలర్ట్ చేస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. భూములకు సంబంధించిన అంశాలు, టెంపుల్ ఎంప్లాయీస్ సర్వీసు వ్యవహారాలు కూడా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అప్పుడే మన డిపార్టుమెంటుకు అనుకూలంగా వస్తాయని తెలిపారు. అయితే, వచ్చిన ఆర్డర్స్ ను అమలు పరిచేందుకు కూడా ఒక వ్యవస్థ ఉండాలని మంత్రి అభిప్రాయపడ్డారు. దేవుడి భూముల జోలికిస్తే పీడీ యాక్టులు పెట్టేందుకు వెనకాడొద్దని అధికారులకు చెప్పారు. ఎండోమెంటు చట్టం మీద అధికారులకు ట్రైనింగు క్లాసులు నిర్వహించాలని మంత్రి చెప్పారు.

## తెలంగాణ లో 9 గుర్తింపులేని రాజకీయ పార్టీలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ, నవభారత్ నేషనల్ పార్టీ, తెలంగాణ ప్రగతి సమితి, తెలంగాణ ఇండిపెండెంట్ పార్టీ ఉన్నాయి. ఈ పార్టీలన్నీ నమోదు అయినప్పటికీ గుర్తింపు పొందలేదని, ప్రజాస్వామ్య ప్రతినిధుల చట్టం 1951 ప్రకారం తప్పనిసరి నివేదికలు, లెక్కలు సమర్పించకపోవడంతో ఎన్నికల సంఘం వాటిని రద్దు చేసిందని సుదర్శన్ రెడ్డి వివరించారు. రద్దయిన పార్టీలు ప్రధానంగా హైదరాబాద్, మేడ్చల్%%మల్కాజిగిరి, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలకు చెందినవే. వీటిలో నాలుగు పార్టీలు హైదరాబాద్‌కు, మరో నాలుగు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాకు, ఒకటి భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు చెందినది. ఈ పార్టీలను రద్దు చేసినట్లుగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారితోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపించామని తెలిపారు. వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కాపాడటమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## కుమార్తెను హతమార్చిన తండ్రి

హైదరాబాద్, సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు): కంటికి రెప్పలా చూసుకోవాల్సిన నాన్నే తన కుమార్తెను కడతేర్చాడు. భార్యపై కోపాన్ని అభం శుభం తెలియని తన 12 నెలల కుమార్తెపై చూపించాడు. ముద్దులొలికే పసి పాపను మద్యం మత్తులో చిదిమేశాడు. క్షణికావేశంలో తన కూతురును నేలకేసి కొట్టి చంపిన ఈ ఘటన సంచలనం సృష్టించింది. భార్యాభర్తలు గొడవ పడుతుండగా గట్టిగా ఏడుస్తున్న చిన్నారిని రెండు కాళ్లు పట్టి నేలకేసి కొట్టడంతో తీవ్రంగా గాయపడిన చిన్నారి అపస్మారక ఒక్కసారిగా స్థితిలోకి వెళ్లింది. కొన ఊపిరితో ఉన్న పాపను తల్లి, ఆమె బంధువులు ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. చికిత్స పొందుతున్న చిన్నారి ఆసుపత్రిలోనే మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రియాంక కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం డి కొత్తపల్లి గ్రామానికి చెందిన గైగొల్ల వెంకటేశ్‌కు, ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా సిరిగిరిపాడు గ్రామానికి చెందిన నాగమణికి రెండేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి భవిజ్ఞ అనే 12 నెలల కుమార్తె ఉంది. కుటుంబ పెద్దలు మ్యారేజ్ బ్యూరో ద్వారా వీరి సంబంధాన్ని ఖరారు చేసి వివాహం జరిపించారు.

కాగా ఈ దంపతులకు నిత్యం గొడవ సర్వసాధారణంగా మారింది. భర్త వెంకటేశ్ మద్యం సేవించడంతో గొడవ మరింతగా ఉండేది. గతంలో ఒకసారి భర్తతో గొడవ కాస్త తీవ్రం కావడంతో నాగమణి పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే వారి కుటుంబంలోని వారు, గ్రామంలోని పెద్దమనుషులు ఆమెకు సర్ది చెప్పడంతో తిరిగి కాపురానికి భర్త ఇంటికి వెళ్లింది.

మద్యం తాగి వచ్చి హింసించే భర్త వెంకటేశ్ ఆ రోజు రాత్రి కూడా భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో వారి మధ్య జరుగుతున్న గొడవను గమనించిన చిన్నారి గట్టిగా ఏడ్చింది. ఆవేశంలో వెంకటేశ్ తన కుమార్తె రెండు కాళ్లు పట్టుకుని నేలకేసి కొట్టాడు. దాంతో చిన్నారి ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకుంది. పక్కనే ఉన్న తల్లి వెంటనే బంధువులను పిలిచింది. తర్వాత కుటుంబ సభ్యులంతా కలిసి పాపను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొన ఊపిరితో ఉన్న భవిజ్ఞను బతికించేందుకు వైద్యులు శ్రమించారు. గంటపాటు సీపీఆర్ చేసి ఆక్సిజన్‌తో బతికించే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. చివరగా శిశువు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడిరచారు. దీంతో తల్లి కన్నీరు మున్నీరుగా విలపించింది. చిన్నారి మరణ వార్తతో ఆ ప్రాంతమంతా విషాధ ఛాయలు అలుముకున్నాయి.

## భారతదేశం యువరక్తంతో ఉరకలెత్తుతోంది

(మొదటి పేజీ తరువాయి)

సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలన్నారు. జెన్‌జీ శక్తిని తక్కువ అంచనా వేయద్దని పాలకులను హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీ భూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అద్భుతంగా పోరాడి ప్రభుత్వ మెడలు వంచిన విషయాన్ని గుర్తుచేశారు. చివరికి సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందన్నారు. ఇదే జెన్‌జీ పవర్ అన్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని కేటీఆర్ సూచించారు. ''రాజకీయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, మీరే ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు?'' అని కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచం అంతా ముసలితనంలో ఉంటే భారతదేశం మాత్రం యువరక్తంతో ఉరకలెత్తుతోందన్నారు కేటీఆర్. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవన్నారు. అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు. కానీ 40 ఏళ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితం అయితే, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగింది. ఇవాళ చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే అన్నారు. చైనా మనల్ని ఎలా దాటిపోయిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. అమెరికా, యూరప్‌లతో చైనా పోటీపడితే, మనం మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చుకుని మురిసిపోతున్నాం'' అన్నారు. అణుబాంబు దాడితో సర్వనాశనమైన జపాన్, కేవలం 23 ఏళ్లలోనే విధ్వంసం నుంచి వికాసం వైపు పయనించిందని కేటీఆర్ గుర్తు చేశారు. 1945లో హీరోషిమా, నాగసాకిలపై అణుదాడి జరిగి లక్షలాది మంది చనిపోయినా జపాన్ కుంగిపోలేదన్నారు. ఎన్నో భౌగోళిక అననుకూలతలు ఉన్నా, ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తినా వాటన్నింటిని తట్టుకుని అద్భుత ఆవిష్కరణలు, పారిశ్రామికీకరణతో నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా జపాన్ ఎదిగిందన్నారు. జపాన్ సాధించినప్పుడు భారతదేశం ఎందుకు సాధించలేకపోయిందో ప్రతి ఒక్కరు ఆలోచించాలన్నారు.

# పార్టీలు మారడంలో కడియం ఐకాన్!

(మొదటి పేజీ తరువాయి)



4వ స్థానంలో నేను ఐకాన్ గా నిలిచానని మాజీ ఎమ్మెల్యే రాజయ్య స్పష్టం చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షులు మాచర్ల గణేష్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కడియం పై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తీవ్రంగా మండిపడ్డారు.

**అవి పేరుకే ప్రొసీడింగ్ కాపీలు...**

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అని చెప్పుకుంటూ 15 రోజులు పరారై, నిన్న హన్మకొండలో బుడుబుంగలెక్క ప్రెస్ మీట్ పెట్టడం తన దివాళితనానికి నిదర్శనమన్నారు. ప్రజా వ్యతిరేకతకు తట్టుకోలేక, ఘన్‌పూర్ విషయాలపై వరంగల్‌లో ప్రెస్ మీట్ పెట్టడం ఘన్‌పూర్ ప్రజల నుంచి తప్పించుకోవడమేనని ఎద్దేవా చేశారు. అభివృద్ధి జాప్యం చెప్పడం పూర్తి గా అబద్ధమని, నిన్న విడుదల చేసిన కాగితం చిత్తకాగితంతో సమానమన్నారు. అది ప్రొసీడింగ్ కాపీ కాదు. కేవలం ఎవరో వేసిన ముద్ర మాత్రమే ఉంది.. సంతకం కూడా పెట్టని పత్రిక వంటిది కడియమని పేర్కొన్నారు. ఇది ప్రపోజల్ మాత్రమే, ప్రొసీడింగ్ కాదు. అందుకే తగల బెట్టడం జరిగిందన్నారు. ఇటువంటి వాగ్దానాలు, అబద్ధాలు మరల చేస్తే ఇలానే తగలబెడుతామని హెచ్చరించారు.

**30 ఏళ్లుగా ప్రజలను మోసం చేస్తున్న కడియం**

30 ఏళ్లుగా ఘన్‌పూర్ ప్రజలను మోసం చేస్తూ అబద్ధాలే చెప్పుకుంటూ వస్తున్న కడియం నిజ స్వరూపం మళ్లీ బయట పడింది. 20 నెలల కాంగ్రెస్ పాలనలో దేవాదుల ప్రాజెక్టుకు ఒక్క పైసా కూడా రాలేదని, తట్టమట్టి కూడా తీసి పనులు చేయించలేదని, కేవలం ప్రపోజల్స్, ఎస్టిమేట్లు మార్చి కమిషన్ కోసం బినామీలకు పనులు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి పనికి కమిషన్‌గా అడ్వాన్స్ తీసేవారే ఆమోదం పొందుతున్నారని మండిపడ్డారు.

**మున్సిపాలిటీ అభివృద్ధి రహితమా?**

మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా రాలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం కేటీఆర్ ఆశీస్సులతో మున్సిపాలిటీ కోసం ప్రొసీడింగ్ ఇచ్చిందని చెప్పారు. 100 పడకల హాస్పిటల్‌కు జీఓ కూడా ఇచ్చిందని, అయినప్పటికీ మున్సిపాలిటీ అయిన తరువాత ఒక్క పైసా మంజూరు కాలేదని పేర్కొన్నారు. ఘన్‌పూర్ మున్సిపాలిటీ ప్రస్తుతం మురుగుతో, చెత్తతో నిండిపోయిందని ఆరోపించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం అప్పులు తీసుకోవాలని నాయకుడు రేవంత్ రెడ్డి చేసిన ప్రయత్నాల గురించి మరియు స్లాబ్ ఇచ్చిన వారికి డబ్బులు రాకపోవడం పై వ్యాఖ్యలు చేశారు.

**ఉపకాలువలు పూర్తి కాలేక రైతుల బాధలు**

నాలుగు గ్రామాలకు నీళ్లు ఇవ్వకుండా, కొన్ని చెరువులకు మాత్రమే నీరు పెట్టి ఉపకాలువలు పూర్తి లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బినామీ కాంట్రాక్టర్ పేర్లతో పనులు అప్పగించడం జరిగుతున్నట్లు, ఎస్సీఎస్టీ భూముల్లో నీరు పోయి పంటలు నాశనమవుతున్నాయి, ఆస్తి నష్టపోయే వారిని నష్టపరిహారం ఇవ్వమని డిమాండ్ చేశారు.

**నీళ్లు ఉన్నప్పటికీ వాటి వినియోగం లేదని ఆవేదన**

ధర్మసాగర్ రిజర్వాయర్‌లో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాలకు నీరు అందడం లేదని, పంపులు పనిచేస్తున్నా సరే ప్రయత్నాత్మకంగా అని ఆరోపించారు. కొన్ని గ్రామాల్లో గేట్లు తిప్పితే నీరు రావచ్చని, అయినప్పటికీ అది ఉద్దేశపూర్వకంగా ఇవ్వబడట్లేదని మండిపడ్డారు.

**కడియం ఇంటి, ఆస్తులపై ఛాలెంజ్**

**కడియం 23 వేల ఇళ్ళు ఇచ్చినట్టు ప్రచారం చేస్తున్నానని అతను చెప్పడం సరైనదినో లేదో, స్లాబ్ పడిన వారికి డబ్బులు ఇవ్వలేదని రాజయ్య తిట్టారు. 1994లో, 2009లో, 2023 తర్వాత ఉన్న ఆస్తుల వివరాలు శ్వేత పత్రంలో ప్రచురించవలసిన డిమాండ్ ఉంచారు. ఎవరు నీతి పరువో, ఎవరు అవినీతి పరువో ఆ వివరాల ద్వారా తెలుస్తుందని పేర్కొన్నారు.**

**నేను అసలైన మాదిగోడిని**

తాను మాదిగ సమాజం కోసం నిలబడే వ్యక్తిని, సంస్కృతి పరిరక్షణలో డైనవాడిని అని రాజయ్య చెప్పారు. రాజకీయ ప్రస్తావనల స్థానంలో ప్రజా అభివృద్ధి పైనే మాటలు మాట్లాడాలని, అవసరమైతే కడియం కూడా సమాధానం ఇవ్వాలని లేదా రాజ్యాంగ గౌరవం కోసం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



# మహమ్మద్ ప్రవక్త ( స) జీవితం ప్రపంచ మానవాళికి మార్గదర్శకం

**జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షురాలు అస్మా అంజుమ్**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** జమాతే ఇస్లామి హింద్ ఇందిరానగర్ నార్త్ శాఖ కార్యాలయంలో మొహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రవక్త సందేశ ప్రచార ఉద్యమంలో భాగంగా నేడు నార్త్ అధ్యక్షురాలు హుస్సేన్ బి అధ్యక్షతన మహిళా పండితుల సమావేశం నిర్వహించబడింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు అస్మా అంజుమ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త (సఅసం) జీవితం మనందరికీ మార్గదర్శకమని ఆయన ప్రజల పట్ల ఎంతో జాలి, కరుణ, ఆదరణ చూపించే వారనీ ఆయన నోటి ద్వారా చేతల ద్వారా ఎప్పుడు ఏ ఒక్కరిని ఇబ్బంది కలిగించలేదని ,ఆయన అనుచరులుగా మనం కూడా ఆయన్ను ఆదర్శంగా తీసుకొని మన జీవితాలను చక్కదిద్దుకోవాలన్నారు. మహమ్మద్ ప్రవక్త ఒక కొడుకుగా, ఒక తండ్రిగా, ఒక సోదరుడిగా, ఆదర్శ దైవదాసుడిగా ,గొప్ప పరిపాలకుడిగా, ఒక స్నేహితుడిగా, ఆయన ఆదర్శ జీవితం ఒక తెరిచిన పుస్తకంలా మన ముందున్నదని ఆయన జీవిత చరిత్రను తెలుసుకొని ఆచరించవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆయన ఆదర్శ బోధనలు పాటిస్తే సమాజంలో శాంతి సౌభ్రాతృత్వం సోదర భావం వెలసిల్లుతాయని తెలియజేశారు. అనంతరం ఇస్లాం మహిళా పండితుల అధ్యక్షురాలు ఖాసీమా షాహిన్ మాట్లాడుతూ ప్రవక్త మొహమ్మద్ (స ) బోధనలు ఊటంకిస్తూ ఆయన ఆదర్శ జీవితం ,ఉత్తమమైన నడవడిక, ఆయన గుణగణాలు గురించి శ్రోతల హృదయాలను కదిలించే విధంగా ప్రసంగించారు .నేటికి ఆయన జీవితం ముస్లింలకే కాక ప్రపంచ మానవులందరికీ ఆదర్శమని, ఆయన బోధనలను అందరూ తూ.చా .తప్పకుండా పాటించవలసిన అవసరం నేడు ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అంజుమ్ ,ఖమ్మం సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుమ్ జమాత్ సభ్యులు ఆరిఫా, హబీబా ,సాలే హ తస్లీమ్, జహరా ఫాతిమా, సబిహ , ఫాతిమా , తబస్సుం, ఆస్మా , నసీమా ,శంసున్నిసా మరియు మహిళా మహిళా ఇస్లామియా పండితులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు





# శ్రీ గ్లోబల్ హైస్కూల్ నాగలవంచలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు..

**బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక.... పాఠశాల కరస్పాండెంట్ ఇనుకుల దివాకర్ రెడ్డి.**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఉన్నటువంటి శ్రీ గ్లోబల్ హై స్కూల్ లో బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ పండుగను ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన పండుగ ,ఇది ముఖ్యంగా మహిళలు జరుపుకునే పండుగ బతుకమ్మ అనగా "బతుకు అమ్మ," అని అర్థం. అంటే మన కుటుంబం ,పిల్లలు ,భర్త ,తల్లిదండ్రులు అందరూ సుఖ సంతోషాలతో బతకాలని ప్రార్థించటమని, ఈ పండుగను అశ్వయుజ శుద్ధ పద్మి నుండి తొమ్మిది రోజులపాటు జరుపుకుంటారని ,చివరి రోజు " సద్దుల బతుకమ్మ" అంటారని, బతుకమ్మ పండుగలో రంగురంగుల పూలతో, పెద్ద బొమ్మ లాంటి పూలదండలు తయారుచేసి వాటిని నది లేదా చెరువు లేదా బావిలో వదిలేస్తారు అని ,మహిళలు సాంప్రదాయ బట్టలు ధరించి బతుకమ్మ చుట్టూ చేరి పాటల పాడుతూ ఆటలాడుతూ ఈ పండుగలో తల్లి భూదేవిని, గౌరీదేవిని పూజిస్తారని ,కుటుంబంలో సుఖ సంతోషాలు ,ఆరోగ్యం ,సంపద సంతానం, కోసం పూజ చేస్తారని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ అయిన ఇనుకుల సుధాకర్ రెడ్డి ,వాహిని రెడ్డి, కవితా రెడ్డి, తిరుపతిరెడ్డి పాఠశాల ప్రిన్సిపాల్ అయినటువంటి తన్నీరు రామారావు ,వైస్ ప్రిన్సిపల్ చాపల మడుగు తిరుపతిరావు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు అందరూ పాల్గొని ఈ పండుగను చాలా ఆనంద ఉత్సాహాలతో జరుపుకోవడం జరిగింది.

# అక్రమ ఇసుక, మట్టి రవాణా నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు...

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు:** అక్రమ ఇసుక, మట్టి రవాణా నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్, తన క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సంబంధిత అధికారులతో కలిసి డి.ఎస్.ఆర్. కమిటీ సమావేశం నిర్వహించి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలం వారీగా గ్రామీణ ప్రాంతాల పరిసరాలలో అందుబాటులో ఉన్న ఇసుక వనరులు, ఇతర గనుల వివరాలకు సంబంధించిన సర్వే రిపోర్టులు తయారు చేసి పకడ్బందీగా అందించాలని కలెక్టర్ తెలిపారు.





జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణా అంశంలో నియంత్రణ సాధించాలని, పత్రికలలో రెగ్యులర్ గా అక్రమ ఇసుక, మట్టి రవాణాపై వార్తలు వస్తున్నాయని, పెద్దగా స్పందన ఉండటం లేదని, దీనిని వెంటనే సవరించాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో ఇసుక, మట్టి రవాణా కోసం జారీ చేసిన అనుమతులను సమీక్షించుకొని నిబంధనలు అమలు అవుతున్నాయో లేదో రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో కూడా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుతుందని, మనం జారీ చేసిన అనుమతులు మేరకే ఇసుక రవాణా జరిగేలా పర్యవేక్షణ ఉండాలని అన్నారు. జిల్లాలో అక్రమ ఇసుక, మట్టి రవాణా అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు పెంచాలని అన్నారు. అక్రమాల నియంత్రణకు పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలం పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేసి అధికారులు రిపోర్ట్ అందించాలని కలెక్టర్ ఆదేశించారు.మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎక్కడా అక్రమ రవాణా జరగకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో సి.పి.ఓ. ఏ. శ్రీనివాస్, భూగర్భ, గనుల సహాయ సంచాలకులు ఆర్. సాయినాథ్, టి.జి.ఎం.డి.సి. ప్రాజెక్ట్ ఆఫీసర్ శంకర్, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# నాచారం డివిజన్ కార్యాలయం ముందు వికలాంగుల మహా ధర్నా

**నాచారం, సెప్టెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ మున్సిపల్ కార్యాలయం ముందు శనివారం వికలాంగుల, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ మహా ధర్నా జరిగింది .ఈ ధర్నాను ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. వికలాంగుల పెన్షన్ 6 వేల రూపాయలకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు 4 వేల రూపాయలకు, కండరాల బలహీనత గల వారికి 15 వేల రూపాయలకు పెంచాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రతినిధి కోరిపాక అంజి మాదిగ మాట్లాడుతూ, "సీఎం రేవంత్ రెడ్డి వికలాంగులు, చేయూత పెన్షన్ దారులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. ప్రభుత్వం పెన్షన్ల పెంపులో నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు. తరువాత నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన శేఖర్ కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ మహా ధర్నాలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కేశవులు, ఉప్పల్ కోఆర్డినేటర్ ఎర్పుల నాగరాజు, నాచారం డివిజన్ అధ్యక్షుడు శ్రీ మూర్తి, నాయకులు నాగరాజు, కోరపాక యోగేష్, సునీల్, విహెచ్పిఎస్ అనిల్, సుమన్, సైదులు, కిషన్, సోమయ్య, శేఖర్ పాల్గొన్నారు.


# అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి

## రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్

**రాచకొండ, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దొంగతనాలు, దోపిడీలు మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి భద్రతా చర్యలను తప్పనిసరిగా బలోపేతం చేయాలి అని రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ పిలుపునిచ్చారు. శనివారం సీపీ కార్యాలయంలో గేటెడ్ కమ్యూనిటీ & విల్లా అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ప్రజలు అనుసరించాల్సిన కీలక మార్గదర్శకాలను ఆయన వెల్లడించారు.

"క్రైమ్ రిపోర్ట్ అందిన ఆరు నిమిషాల్లోనే పోలీస్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుంటాయి. అందువల్ల ప్రజలు ఎటువంటి సందేహం లేకుండా వెంటనే పోలీసులను సమాచారం అందించాలి" అని ఆయన స్పష్టం చేశారు. అలాగే, స్విగ్గీ, జొమాటో వంటి డెలివరీ బాయ్‌ల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రజల కోసం కీలక సూచనలు:

ఇంటి ప్రవేశ ద్వారాలు, గేట్లు, ప్రధాన రహదారుల వద్ద హెచ్‌డీ నైట్ విజన్ సీసీ టీవీ









కెమెరాలు అమర్చాలి. కెమెరాలను పోలీస్ కమాండ్ & కంట్రోల్ రూమ్ తో అనుసంధానించాలి. తలుపులు, కిటికీలకు సెన్సార్ అలారాలు, బలమైన తాళాలు, గ్రిల్స్ అమర్చాలి. ఇంటి నుండి గైర్హాజరీ సమయంలో పొరుగువారితో సమాచారం పంచుకోవాలి. అవసరమైతే ప్రొఫెషనల్ సెక్యూరిటీ గార్డులను నియమించాలి.ఇంటి చుట్టూ మోషన్ సెన్సార్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.సోషల్ మీడియాలో ప్రయాణ ప్రణాళికలు లేదా ఇంటి గైర్హాజరీ సమాచారం పంచుకోవద్దు. ప్రజలకు విజ్ఞప్తి: "నివాసితులు భద్రతా చర్యలను ఖచ్చితంగా అమలు చేస్తే దొంగతనాలు, దోపిడీలను సమర్థవంతంగా అరికట్టగలుగుతాం. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి" అని సుధీర్ బాబు ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.సమావేశంలో పాల్గొన్న అధికారులు:ఈ సమావేశంలో డీసీపీ మల్కాజ్‌గిరి పద్మజ, ఐపీఎస్; డీసీపీ ఎల్బీ నగర్ ప్రవీణ్ కుమార్, ఐపీఎస్; డీసీపీ భువనగిరి అక్షర్ష్ యాదవ్, ఐపీఎస్; డీసీపీ మహేశ్వరం సునీత రెడ్డి; డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు; డీసీపీ అడ్మిన్ ఇందిర; ఎస్బీ డీసీపీ జి. నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఫిర్యాదుల కోసం సంప్రదించవలసిన నంబర్లు:100,9490617111




# శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** బతుకమ్మ పండుగ పురస్కరించుకుని శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు సందడిగా సాగాయి. సాంప్రదాయ వస్త్రాలు ధరించిన విద్యార్థినులు పూలతో బతుకమ్మ పేర్చి ఆడిపాడారు. ఆటపాటలతో పాఠశాల కోలాహలంగా మారాయి.ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్ పర్సన్ నిష్టాశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, నేటి తరం యువతకు బతుకమ్మ గురించి తెలుపవలిసిన అవసరం మనందరిపైన ఉన్నదని తెలిపారు. దసరా, బతుకమ్మల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినులు సంప్రదాయక బట్టలు ధరించి, వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలను ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

# దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీకి ఘన ఆరంభం

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాలలో 22వ తేదీన జరగనున్న ఫ్రెషర్స్ పార్టీకి శుభారంభం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు నూతన విద్యార్థులకు అద్భుతమైన స్వాగత వేదికను సిద్ధం చేసి, స్నేహపూర్వక వాతావరణంలో ఫ్రెషర్స్ పార్టీ జరపబోతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా ఫ్రెషర్స్ పార్టీకి సంబంధించిన ప్రత్యేక ఫ్లెక్స్‌ను ఆవిష్కరించడం విశేషం.

ఈ వేడుకలో కళాశాల అధిపతి మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కిరణ్ పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తమని, కళాశాల విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాలలోనూ ముందంజలో ఉండాలని సూచించారు. అలాగే ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చైతన్య గారు, విభాగాధిపతులు ఏవో చిరంజీవి, ప్రియాంక, మానస, రాజ్, సోమశేఖర్ నవీన్, వెంకటరావు , శ్రావణి రేహమతి సాదిక్ పుల్లయతో పాటు ఇతర అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఫ్రెషర్స్ మరియు సీనియర్స్ కలిసి ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.







తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## స్మార్ట్ కిడ్జ లో అంబరాన్నంటిన బతుకమ్మ పూల సంబురం

- చప్పట్లతో,కోలాట నృత్యాలతో ఆడి పాడిన విద్యార్థులు.
- తెలంగాణ పూల పండుగ బతుకమ్మలతో చిన్నారుల సందడి

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** పూలను దేవతగా భావించి పూజలు అందించే బతుకమ్మ పండుగ సంబరాలు స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం చిన్నారుల ఆనందోత్సవాలతో ఘనంగా నిర్వహించారు.

పాఠశాల చిన్నారులంతా సాంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మ వేడుకలలో హుషారుగా పాల్గొన్నారు. బతుకమ్మలను పలురకాల పూలతో అందంగా పేర్చి తమ తమ ఇళ్ల నుంచి ప్రత్యేక వస్త్రధారణలతో పాఠశాలకు చేరుకొని బతుకమ్మలను ఉంచి వలయాకారంగా చప్పట్ల తాళాలతో, బతుకమ్మ గేయాలతో ఉత్సాహంగా పూల సంబురాలు నిర్వహించారు. తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకంగా పరిమితమైన ఈ సంబురాలను పాఠశాలలో అంబరాన్ని అంటేలా నిర్వహించారు. కోలాటం నృత్యాలతో పాఠశాలలో హోరెత్తించారు. ఔషధ గుణాలు కలిగిన పూలను అందంగా, నేర్పుగా బతుకమ్మలను పేర్చడంతో పాఠశాల చిన్నారులు ఆనందోత్సవాలతో వేడుకలలో మురిసిపోయారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ అనాది కాలంగా తెలంగాణ గౌరవ ప్రతిష్టలను బతుకమ్మ సంబురాలు ఇనుమడింప చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆడపడుచుల, చెరువుల పండగగా బతకమ్మ వేడుకలను ప్రకృతి రమణీయతతో ఈ ఉత్సవాలను ఇంటింటా నిర్వహించుకునే పూల సంబురం తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటి చెబుతున్నదని తెలిపారు. ఔషధ గుణాలున్న పూలతో ఎంగిలిపూల బతుకమ్మతో మొదలుకొని సద్దుల బతుకమ్మ దాకా తొమ్మిది రోజులపాటు పలు రకాల ఫలహారాలతో ఒకరికొకరు ఆత్మీయంగా,సమైక్యంగా ఉంటూ తమ ఆనందాలను పంచుకునే ప్రత్యేక సంబరాలు బతుకమ్మ వేడుకలలో అందరినీ ఉత్సాహంగా ఉంచుతున్నాయన్నారు. తమ పాఠశాలలో తెలంగాణ ప్రత్యేక సంబురం బతుకమ్మ వేడుకలను నిర్వహించడం ద్వారా మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను పాఠశాల విద్యార్థులకు తెలియజేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







## సత్తుపల్లిలో ఘనంగా ఫ్రెషర్స్ డే, పోషణ మాసం కార్యక్రమాలు.!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలో శనివారం ఉత్సవ వాతావరణం నెలకొంది. శ్రీ బండి శోభనచలం ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించబడ్డాయి. కొత్త విద్యార్థులకు ఉత్సాహం నింపుతూ యూనిఫామ్స్, నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ దంపతులు విద్యార్థులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఆశా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు.

అదేవిధంగా, కొత్తూరు గ్రామ రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న పోషణ మాసం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తొమ్మిది మంది గర్భిణీ మహిళలకు శ్రీమంతం వేడుక, ఇద్దరు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించబడ్డాయి. ఎమ్మెల్యే రాగమయి ఆశీర్వచనాలు అందించి సంతోషాన్ని పంచారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహార పదార్థాల ఉపయోగాలు, ఆరోగ్య సూచనలను కూడా వివరించారు.

ఈ కార్యక్రమాల్లో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, గాదె చెన్నారావు, కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సూపర్వైజర్లు, మాజీ కౌన్సిలర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొని వేడుకలను మరింత విశిష్టంగా తీర్చిదిద్దారు.

## మహిళల ఆత్మనిర్భరతకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేయూత

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయాలనే లక్ష్యంతో మల్కాజ్గిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి విశేష సహకారం అందించారు.మల్కాజ్గిరి నియోజకవర్గం లో సర్దార్ పటేల్ నగర్ మహిళలకు శిక్షణ కోసం ఆయన స్వంత నిధులు మొత్తం 2,50,000 రూపాయలు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా స్టిచ్చింగ్ మెషీన్లు 5, జూకి మెషీన్లు 5, పికో మెషీన్లు 2, కట్టింగ్ టేబుల్స్ 2, చెయర్స్ 50, మీటింగ్ టేబుల్ 1, మెషీన్ స్టూల్స్ 12, అల్మార 1 ను మహిళలకు



ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని మల్కాజ్గిరి మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ - "ఎమ్మెల్యే సహకారం వల్ల స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగి, కుటుంబ ఆర్థికాభివృద్ధికి దోహదం అవుతుంది" అని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు చంద్రకళ, ప్రేమలత, తార, లక్ష్మి, లలిత పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డోలీ రమేష్, జనార్ధన్, బంటి, నవీన్ తదితరులు హాజరయ్యారు.స్థానిక మహిళలు మాట్లాడుతూ - "ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేసిన సాయం మా జీవితాల్లో కొత్త ఆశలు నింపింది. ఈ పరికరాలతో శిక్షణ పొంది, భవిష్యత్తులో స్వయం ఉపాధితో ముందుకు సాగుతాం" అని కృతజ్ఞతలు తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు కఠిన చర్యలు..

- రాష్ట్ర,జిల్లా సరిహద్దుల్లో 15 చెక్ పోస్టుల ఏర్పాటు... నిరంతర పర్యవేక్షణ
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** ఆంధ్రప్రదేశ్ నుండి ఇసుక అక్రమ రవాణా నియంత్రించేందుకు జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. నిబంధనలు విరుద్ధంగా జరిగే ఇసుక రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ద్వారా పోలీస్, మైనింగ్, తదితర శాఖల సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని అధికారులకు ఆదేశించారు. చెక్ పోస్టులలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఆంధ్ర నుంచి ఇసుక రవాణా చేసిన వాహనాలపై కేసులు నమోదు చేయడం, వాహనాలను జప్తు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాపై స్థానిక పోలీసుల పెట్రోలింగ్ తో పాటు స్పెషల్ బ్రాంచ్ అధికారుల నిరంతరం నిఘాతో పూర్తి స్థాయిలో సమాచారం సేకరించాలని సూచించారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన 15 చెక్ పోస్టులలో సిబ్బంది 3 షిఫ్టులలో 24 గంటలు పనిచేస్తాయని పోలీస్ కమిషనర్ వివరించారు.

## మద్దిగట్ల - మోజర్ల పాఠశాలలో అంబరాన్నంటిన బతుకమ్మ



**పెద్దమందడి,సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రతి తరగతి విద్యార్థినీ విద్యార్థులు బతుకమ్మలు తయారుచేసి గౌరమ్మను పూజించారు. సరస్వతి మాత విగ్రహానికి నూతన వస్త్రాలు సమర్పించి పూలతో అలంకరించి వేడుకలను ఆరంభించారు. ఈ కార్యక్రమానికి పెద్దమందడి మండల విద్యాధికారి మంజులత ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులతో కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. పది రోజులపాటు జరిగే బతుకమ్మ మరియు దసరా ఉత్సవాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాదరావు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ ప్రత్యేకత, దసరా ఉత్సవాలు జరుపుకునే విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే, దసరా సెలవుల్లో పాఠశాలలో ఇచ్చిన ఇంటిపనులను పూర్తి చేసి పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



**విద్యార్థులతో కలసి ఆట పాటల్లో తాతయ్యలు – అమ్మమ్మలు ఉత్సాహం**

**తార్నాక, సెప్టెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు):** తార్నాక నారాయణ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే ను శనివారం అత్యంత ఆనందోత్సాహాలతో నిర్వహించారు. విద్యార్థుల తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు తమ మనువళ్లు, మనవరాళ్లతో కలిసి ఆట పాటల్లో పాల్గొని క్షణాలను చిరస్మరణీయంగా మార్చుకున్నారు.ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిఎం గోపాల్ రెడ్డి మరియు ఎజిఎం బాలపరమేశ్వర్ ఆటల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు.పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ మాట్లాడుతూ:నేటి పిల్లలు తాతయ్యలు, అమ్మమ్మలతో గడిపే సమయాన్ని గౌరవించి, వారి ప్రేమను, అనురాగాన్ని ఆస్వాదించాలి. ఇది పిల్లలలో విలువలు, బంధాలను బలపరచడంలో తోడ్పడుతుంది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈ చాంప్స్ కోఆర్డినేటర్ లక్ష్మీ భవాని, ఈకిడ్జ్ కోఆర్డినేటర్ నూర్, ఈ చాంప్స్ సరిత, ఈకిడ్జ్ షాహీన్, ఏఓ మహేందర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు. ఫోటో క్యాప్షన్ సూచనలు: మనవరాళ్లతో ఆటల్లో పాల్గొంటూ తాతయ్యలు, అమ్మమ్మలు. విజేతలకు బహుమతులు అందజేస్తూ ముఖ్య అతిథులు.పిల్లలతో కలిసి సంతోషం గా గడిపిన తాతయ్యలు,నానమ్మలు.

## ఉప్పల్ కుమ్మరి సంఘం భవనం త్వరలోనే నిర్మిస్తా

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ కుమ్మరి సంఘానికి ప్రత్యేక భవనం నిర్మాణం కల సాకారం కానుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కుమ్మరి సంఘం ప్రతినిధులు సమావేశమై సంఘ భవన నిర్మాణం కోసం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నేను అమలు చేస్తాను. ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి వర్గం అభివృద్ధి పథంలో నడవాలి. ఈ దిశగా కమ్మరి, కురుమ, ముదిరాజ్ వంటి సంఘాల అవసరాలను తీర్చడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. కుమ్మరి సంఘం భవనం నిర్మించి మాట నిలబెట్టుకుంటాను" అని తెలిపారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంఘాలు సామాజిక ఐక్యతకు ప్రతీకలని, వాటి ద్వారా వృత్తి అభివృద్ధి, యువతకు మార్గదర్శనం కలుగుతుందని పేర్కొన్నారు. త్వరలోనే ప్రభుత్వ నిధుల సహకారంతో లేదా కార్పొరేషన్ మంజూరు చేసే నిధుల ద్వారా భవన నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కురుమ సంఘం నాయకులు జి. బోగుట యాదయ్య, జి. మల్లేష్, భాస్కర్, అశోక్ ఫోటో, బుల్లెట్ కృష్ణ, ఎన్. జంగయ్య, బి. ప్రకాష్, జి. రాధా కిశోర్, కీసర భిక్షపతి, జి. మహేశ్ భిక్షపతి, జి. కృష్ణ (సత్తయ్య) తదితరులు పాల్గొన్నారు.





# పెన్షన్ దారుల, వికలాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్**

**గౌతమ్ నగర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల ముందు ప్రజలకు పెద్ద పెద్ద వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ పెన్షన్ల పెంపు విషయంలో మాట నిలబెట్టుకోలేదని గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తీవ్రంగా విమర్శించారు. ఎమ్మార్పీఎస్, విహెచ్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ కార్యదర్శులు, మున్సిపల్ కౌన్సిలర్లు, జిహెచ్ఎంసి కార్పొరేటర్లకు వినతి పత్రాలను అందజేస్తున్న భాగంగా నాయకులు శనివారం కార్పొరేటర్ కార్యాలయంలో కలసి వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షన్ దారులకు రూ.4,000 నుంచి రూ.6,000, వికలాంగులకు రూ.2,000 నుంచి రూ.4,000 పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.కానీ కొత్త పెన్షన్ విధానం అమలు చేయక పోవడం పేద ప్రజలను మోసం చేసినట్లేనని ఆరోపించారు.ఈ సమస్యపై ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.తాను చేస్తున్న కృషి గురించి మాట్లాడుతూ -"మీ ఉద్యమాన్ని మా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తాను. పెన్షన్ దారులు, వికలాంగులకు న్యాయం జరిగేలా నా వంతు సహకారం అందిస్తాను" అని కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్చార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు కేశపాగ రామచందర్ మాదిగ, ఎంజెఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, మేడ్చల్ జిల్లా విహెచ్పీఎస్ అధ్యక్షులు వినయ్, నాయకులు కేబీజె హరి,పి.రాములు, సోను, నరసింహ, రాములుయాదవ్,రమాదేవి, జ్యోతి కీర్తి,ఎన్.ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా బతుకమ్మ సంబరాలు

**పాల్గొన్న రజిత పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ డివిజన్ శ్రీ గాయత్రి స్కూల్ మరియు సర్ మౌంట్ స్కూల్‌లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ పండుగగా పేరుగాంచిన బతుకమ్మను విద్యార్థులు, మహిళలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు .రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను మహిళలు వలయంగా తిరుగుతూ పాటలతో ఆరాధించారు. బతుకమ్మ చుట్టూ విద్యార్థులు పాడిన జానపద గీతాలు అక్కడి వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయి.ఈ కార్యక్రమంలో రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొని విద్యార్థులు, మహిళలను ఉత్సాహపరిచారు. ఆమె మాట్లాడుతూ -"బతుకమ్మ పండుగ పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధించే అద్భుత సంప్రదాయం. ఇది తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక. మన సంస్కృతిని తరతరాలకు అందించే బాధ్యత అందరిదీ" అని తెలిపారు. స్కూల్ యాజమాన్యం, కాలనీ మహిళలు, స్థానికులు సమిష్టిగా ఈ వేడుకలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.





# సెరినిటి పాఠశాలలో బతుకమ్మ సంబురాలు

**నాగారం, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సంప్రదాయ సంస్కృతి, స్త్రీ శక్తి ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను నాగారం సెరినిటి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాల ప్రాంగణం పూల పరిమళాలతో నిండిపోయింది. విద్యార్థినులు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి అలరించారు.వేడుకల్లో చిన్నారులు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలసి బతుకమ్మ పాటలు పాడుతూ, చక్కగా వలయాలు వేసి ఆడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. తల్లిదండ్రులు కూడా పాల్గొని పిల్లలను ఉత్సాహపరిచారు.

సెరినిటి పాఠశాల ముఖ్య కార్యదర్శి నోముల వసంత మాట్లాడుతూ - "బతుకమ్మ పండుగ అనేది ప్రకృతిని ఆరాధించే ఆచారం. పూలతో చేసే ఈ వేడుకలో ప్రకృతి సౌందర్యం, వనరుల సంరక్షణ, స్త్రీల ఐక్యత ప్రతిఫలిస్తాయి. మన తెలంగాణ ఆత్మబంధం బతుకమ్మలోనే ప్రతిబింబిస్తుంది" అని తెలిపారు.అలాగే విద్యార్థులకు పండుగల ప్రాముఖ్యతను, వాటి వెనుక ఉన్న విలువలను వివరించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని సంబురాలను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు.



# విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడిన ఉపాధ్యాయులు

**సత్తుపల్లి, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వి ఎం బంజర్‌లో బతుకమ్మ వేడుకలు ఈసారి ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు, రంగులెరుపు చీరల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పండుగకు మరింత ఉల్లాసాన్ని చేకూర్చారు. విద్యార్థులు సాంప్రదాయ గీతాలు పాడుతూ, బతుకమ్మను చుట్టి నర్తడం పండుగను నెరవేర్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు కూడా ఈ వేడుకలో పాలుపంచుకొని ఉల్లాసాన్ని పెంచారు.

పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ కేవలం సాంప్రదాయానికి మాత్రమే కాదు, విద్యార్థుల్లో సాంఘిక ఐక్యతను పెంపొందించే అవకాశంగా ఉంటుంది. పిల్లలు సాంప్రదాయాలను గౌరవిస్తూ ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉంది అన్నారు.ఈ వేడుక ద్వారా పాఠశాల వాతావరణం పరవళ్లు సిల్లుతూ, సాంప్రదాయ పండుగ ఉత్సవానికి ప్రత్యేక ఉల్లాసాన్ని తెచ్చింది.

# డా. ఏ ఎస్ రావు జయంతి వేడుకలు

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ శాస్త్రవేత్త, ఈసీఐఎల్ స్థాపకుడు పద్మభూషణ్ డాక్టర్ ఎ. ఎస్. రావు 111వ జయంతి సందర్భంగా ఈసీఐఎల్ మైన్‌గేట్ వద్ద ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సి & ఎండి అనురాగ్ కుమార్, డైరెక్టర్ (టి) డాక్టర్ అనేష్ కుమార్ శర్మ, ఓఎస్, ఇతర డైరెక్టర్లు, సీనియర్ అధికారులు కలిసి డాక్టర్ ఎ.ఎస్. రావు విగ్రహానికి పూలమాలలు వేసి గౌరవ నివాళులు అర్పించారు. డాక్టర్ ఎ. ఎస్. రావు భారత దేశం శాస్త్ర సాంకేతిక రంగానికి అందించిన విశేష సేవలను అధికారులు స్మరించుకున్నారు. ఆయన దూరదృష్టి, కృషి, ఆవిష్కరణాత్మక ఆలోచనలు ఈసీఐఎల్‌ను జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక సంస్థగా నిలబెట్టాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ - "డాక్టర్ ఎ. ఎస్. రావు చూపిన మార్గం మా అందరికీ శాశ్వత ప్రేరణ. ఆయన వారసత్వాన్ని కాపాడుకుంటూ సాంకేతిక రంగంలో మరిన్ని విజయాలు సాధించేందుకు కృషి చేస్తాం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్ సిబ్బంది, ఉద్యోగులు కూడా పాల్గొన్నారు.





# తారాశ్రీ తొలి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎస్ఎల్వి గ్రాండ్ హాల్‌లో శనివారం అక్కల భార్గవి - మధుసూదన్ గౌడ్ గారి కుమార్తె తారాశ్రీ తొలి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానిక ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఆయన తారాశ్రీకు ఆరోగ్యవంతమైన, విజయం మరియు సంతోషభరితమైన జీవితాన్ని కోరికలు తెలిపారు. అలాగే తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లవాడి ఎదుగుదలకు మంచి ఆహ్వానాలు సూచించారు.

జన్మదిన వేడుకలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, కాగితాల లక్ష్మీనారాయణ, బాల్ రెడ్డి, ముత్తు కృష్ణ గురుస్వామి, తోట శ్రీను తదితరులు హాజరై వేడుకను మరింత ఉత్సాహవంతంగా చేశారు. చిన్నారికి ఇచ్చిన బహుమతులు, పూలమాలలతో అలంకరించిన గీతలు, ఆటలు, కేక్ కటింగ్ కార్యక్రమం ఈ వేడుకను మరింత ప్రీతికరంగా మార్చాయి.

పార్టీలో చిన్నారికి ప్రత్యేకంగా సెట్ చేసిన రంగుల, బాలుపాటల వేదికలో తారాశ్రీ సంతోషంగా ఆటలు ఆడుతూ, కుటుంబ సభ్యుల అభిమానం పొందింది. ఈ వేడుక ద్వారా కుటుంబ సాంప్రదాయాలు, సానుకూల వాతావరణం కాపాడుతూ, చిన్నారి మొదటి సంవత్సరం గుర్తింపుగా గుర్తించబడింది.

# ఘనంగా డా. ఎ. ఎస్. రావు 111వ జయంతి వేడుకలు



**విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు**

**ఎ. ఎస్. రావు నగర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ శాస్త్రవేత్త, పద్మభూషణ్ డాక్టర్ అయ్యసంభాశివరావు (డా. ఎ. ఎస్. రావు) 111వ జయంతి వేడుకలు శనివారం డా. ఎ. ఎస్. రావు నగర్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ, "డా. ఎ. ఎస్. రావు విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో చేసిన సేవలు దేశానికి చిరస్మరణీయమైనవే. ఆయన పేరు మీద ఈ ప్రాంతం ఏర్పడటం గర్వకారణం. యువత ఆయన జీవితం నుంచి ప్రేరణ పొందాలి" అని అన్నారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, కార్యదర్శి కుమార స్వామి, బేతల బాలరాజు, ఎస్.ఎ. రహీమ్, మురళి పంతులు, మహేష్ గౌడ్, సింగారం రాజు, మనెమ్మ, కృష్ణ, మాట్లగిరి, ఊట్ల మొగులయ్య, సాయి రెడ్డి, యాకయ్య, వెంకట్ రాజు, భవానినగర్ మొగులయ్య, శివ, సత్యనారాయణ, బసవయ్య, ప్రకాష్, రాజు గౌడ్, నాగపురి రాజు, తిరుమలయ్యతో పాటు అనేక మంది కాలనీ వాసులు పాల్గొని నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు సమన్వయం చేశారు. చివరగా డా. ఎ. ఎస్. రావు జీవితం, సేవలపై స్మృతుల్ని పంచుకుంటూ కార్యక్రమం ముగిసింది.

# ఎట్టకేలకు ఏకలవ్య నగర్‌లో యుపిఎస్సి భవన నిర్మాణానికి మోక్షం

**గౌతమ్ నగర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఏకలవ్య నగర్‌లో యుపిఎస్సి భవన నిర్మాణా నికి ఎట్టకేలకు శ్రీకారం చుట్టబడింది. గత కొన్నేళ్లుగా గౌతమ్ నగర్‌లో యుపిఎస్సి సెంటర్ ఉన్నప్పటికీ, సొంత భవనం లేక అద్దె ఇళ్లలోనే కార్యకలాపాలు కొనసాగించాల్సి వచ్చింది .ఈ సమస్యను పరిష్కరిం చేందుకు మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి చేసి, 1 కోటి 43 లక్షల రూపాయలు భవన



నిర్మాణానికి మంజూరు చేయించా రు.శనివారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మల్కాజ్గిరి తహసీల్దార్ కార్యాలయ ఆర్.ఐ పరమేశ్వర్ రెడ్డి, సర్వేయర్ ప్రశాంత్‌లతో కలిసి ఏకలవ్య నగర్‌లో భవన స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఏకలవ్య నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు భవన నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ, ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు మైసయ్య, నర్సింగరావు, చిట్టిబాబు తో పాటు స్థానిక నాయకులు మేకల రాము, సిద్ధిరాములు, అనిల్, కావాలి శ్రీనివాస్, భారత్ ప్రజలు పాల్గొన్నారు.

ఆదివారం-21- సెప్టెంబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# మహిళల భద్రతే షీ టీమ్స్ లక్ష్యం

## రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు, ఐపీఎస్

**రాచకొండ కమిషనర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రతను అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని షీ టీమ్స్ కఠిన చర్యలు కొనసాగిస్తున్నాయి. "మహిళలు ఎక్కడైనా, ఎప్పుడైనా భయపడకుండా తిరగాలి. వారిని వేధించే వారికి రాచకొండలో చోటు లేదు" అని సీపీ జి.సుధీర్ బాబు, ఐపీఎస్ హితవు పలికారు.15 రోజుల్లో 310 ఈవ్‌టీజర్ల అరెస్టు

గత పదిహేను రోజుల్లో షీ టీమ్స్ మఫ్టీలో తిరుగుతూ, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, మార్కెట్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాయి. ఈ క్రమంలో మహిళలు, బాలికలను వేధిస్తున్న 310 మంది(మేజర్స్-181,మైనర్స్-129) పోకిరీలను పట్టుకొని న్యాయస్థానంలో హాజరుపరిచారు. వారిని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి, ఇలాంటి తప్పిదాలు మళ్లీ జరగకుండా హెచ్చరించారు.ఫిర్యాదుల గణాంకాలు ఈ నెల 1 నుండి 15 తేదీ వరకు




షీ టీమ్స్‌కి 339 ఫిర్యాదులు అందాయి.

ఫోన్ ద్వారా వేధింపులు - 64

సోషల్ మీడియా యాప్‌ల ద్వారా వేధింపులు - 117 ,ప్రత్యక్ష వేధింపులు - 158,వాటిలో 7 క్రిమినల్ కేసులు, 98 పెట్టి కేసులు నమోదు కాగా, 210 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

సంచలనాత్మక కేసులు

మహిళ గోప్యతకు భంగం: ఇంటి వెంటిలేటర్ ద్వారా స్నానం చేస్తున్న మహిళ ఫోటోలు తీసిన వ్యక్తిని గుర్తించి అరెస్టు చేశారు.హాస్టల్ వద్ద అసభ్యకర ప్రవర్తన: బైక్‌పై వచ్చిన యువకుడు తన ప్రైవేట్ పార్ట్స్ చూపుతూ విద్యార్థినిని వేధించగా, షీ టీమ్స్ అదుపులోకి తీసుకుంది.

బంధువు వేధింపులు: ఇప్పటికే వివాహితుడైన దూరపు బంధువు యువతిని పెళ్లి చేసుకోవాలని బలవంతం చేస్తూ ఇబ్బంది పెట్టగా కేసు నమోదు చేశారు.బస్టాండ్ న్యూసెన్స్: ఎల్‌బీ నగర్ బస్టాండ్‌లో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని పట్టుకున్నారు.అవగాహన కార్యక్రమాలు మహిళలపై నేరాలు నివారించేందుకు షీ టీమ్స్ విద్యార్థులు, ప్రజలలో విస్తృత అవగాహన కల్పిస్తున్నాయి. ఈ నెల 1 నుండి 15 తేదీ వరకు 79 కార్యక్రమాలు నిర్వహించి, 17,450 మందికి పైగా మహిళా చట్టాలు, వారి హక్కులు, జాగ్రత్తలు, భద్రతా చర్యలపై వివరించారు.మెట్రో రైళ్లలో ప్రత్యేక ఆపరేషన్లు మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించిన షీ టీమ్స్ మహిళల కోసం కేటాయించిన కంపార్ట్‌మెంట్ల లోకి ప్రవేశించిన 7 మంది పురుషులను పట్టుకుని, మెట్రో అధికారుల ద్వారా జరిమానా విధించారు.మహిళలు వేధింపులకు గురైతే నిర్భయంగా రాచకొండ షీ టీమ్స్ వాట్సాప్ నెంబర్ 8712662111 ద్వారా లేదా ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నంబర్లు క్రింది నంబర్లకు సంప్రదించవచ్చు :భోనగిరి ఏరియా 8712662598,చౌటుప్పల్ ఏరియా 8712662599,ఇబ్రహీంపట్నం ఏరియా 8712662600,కుషాయిగూడ ఏరియా 8712662601, ఎల్బీనగర్ ఏరియా 8712662602,మహేశ్వరం ఏరియా 8712665299,మల్కాజ్గిరి ఏరియా 8712662603,వనస్థలిపురం ఏరియా 8712662604,యాదాద్రి ఏరియా 8712665300.ఈ కార్యక్రమం లో డీసీపీ టి.ఉషారాణి,ఏసీపీ పల్లె వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్ ఎం.ముని, జి.అంజయ్య, ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సెలర్లు పాల్గొన్నారు.

# కానరానిదేశంలో కన్నబిడ్డ తల్లడిల్లుతున్న పేగు బంధం

**విదేశీ విధానాలతో ఎన్నారై ల మానసిక ఒత్తిడి**
**సామాజిక వేత్త లోడిగ. వెంకన్నయాదవ్**

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 20,తెలంగాణ ముచ్చట్లు;** ఉన్నతవిద్యకొరకు ,ఉత్తమమైన ప్రమాణాలతో జీవన విధానంలో జీవిత మార్పు కొరకు , భారతీయ విద్యార్థులు తమ భౌషత్ కొరకు విదేశీ బాటపట్టారు. అదే వారి పాలిట 'ట్రంపు 'రూపంలో శాపంగా మారనుంది. ఆర్థిక వెసులుబాటు తో కొంతమంది, ఆర్థిక వెసులుబాటు లేక పోయినా బ్యాంకు ఋణాలతో మరి కొంతమంది తమ పిల్లల భౌషత్ కొరకు బంగారు బాటను ఊహించి విదేశీ చదువు ను ప్రోత్సహించారు తల్లి దండ్రులు. ఆస్తులు తాకట్టు పెట్టి ఋణగస్తులై పిల్లలు అడిగిందే తడువుగా ఏదేశం పడితే ఆ దేశం పంపించారు. ఒకరివెనుక ఇంకొకరు 'క్యూ'కట్టి వెళ్ళారు. యువత అంతా భారత దేశం ఖాళీ చేసి వెళ్ళుతున్నారు అన్నంతగా భ్రాంతి కలిగించారు. అక్కడ ఉద్యోగం పొంది విలాసవంతమైన బంగ్లా, కారు కోట్లలో కొనుగోలు చేసి తమ జీవితాలు ఈఎంఐ లకు తాకట్టు పెట్టి ఇప్పుడు ఉద్యోగ భద్రత లేక బీతిల్లిపోతున్నారు కొందరు. చదువు పూర్తి అయినా ఇంకా కొలువు తీరక అక్కడ పని దొరకక వెతలు పడుతున్న వారెందరో....ఉత్తచేతులతో ఇంటికి రాలేక విదేశాలలో ఉద్యోగం లేక తెచ్చిన బ్యాంకు ప్రైవేట్ అప్పులు భారంగా భావించి మానసిక ఒత్తిడితో బాధపడుతూ బతుకు జీవుడా అని విదేశాలలో కాలం వెల్లదీస్తున్న యువత మరికొందరు. ఒకరి తో ఇంకొకరికి సంభందం లేకుండా బాధలు అనుభవిస్తూ పనిచేసుకొంటూ చాలిచాలని జీతంతో జీవితం గడుపుతున్నారు. తల్లిదండ్రులను పైసలు పంపించండి అని అడగలేక అక్కడ పని దొరకక వెతలు పడుతున్న పిల్లల బాధలు తెలుసుకొని తెలిసినా తెలియనట్టు తల్లిదండ్రులు లోలోన మనసులో మదనపడుతూ కుమిలిపోతున్న కన్నతల్లిదండ్రులు మరికొందరు ...విదేశీయుల రాకతో స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేకుండా దేశీయులు నష్టపోతున్నాము అని జాతిభేదాలతో రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తున్నారు అక్కడ నాయకులు. దానిలో ప్రథముడు డోనాల్డ్ ట్రంప్ ఒకరు .దీనిని అదునుగా చూసుకొని కొందరు సంఘవిద్రోహ శక్తులు జాతి విభేదాలు సృష్టించి కాల్చిచంపడం,హత్యచేయటం సంఘటనలు జరుగుతున్నాయి. విదేశీయులు వెళ్ళిపోవాలి అని ఇటీవల లండన్ లో బారీ ర్యాలీ జరిగింది. అక్కడి నాయకులు కూడ దేశీయ చట్టాలు మార్పు చేస్తున్నారు. స్వదేశీయులకు అనుకూలంగా నినాదాలు చేస్తున్నారు.మన వారు బయట తిరగడానికే భయపడుతున్నారు. దేశీయ స్వప్రయోజనాలు మాకు ముఖ్యం అని నీతిసూత్రాలు పలుకుతూ దేశీయ రాబడి పెంపుకు విదేశీయులను నుంచి ఫీజుల రూపంలో దండిగా రాబట్టు కొంటున్నారు. .కాలేజి ఫీజులు పదిరెట్లు పెంచి విదేశీయుల రాబడితోనే నడుపుతున్న కాలేజీలెన్నో... ఉద్యోగ మోజులో బ్రోకర్ వ్యవస్థను ఆశ్రయించి వారిద్వార జీవితకాలం ఆదాయం దారబోస్తూ తప్పుడు పత్రాలతో పట్టు పడుతున్నావారు కొందరు.



ఇదంతా తెలిసినా లక్షలు వెచ్చించి ఉన్నత విద్యకొరకు వెళ్ళి ఉద్యోగం సంపాదించలేక వీసా గడువు ముగుస్తున్నా అక్కడే ఉండి చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ పెట్రోల్ బంకులలో, మాల్స్ లలో హోటల్లో , వీది షాపులలో పనిచేస్తూ జీవితం గడుపుతున్నారు. ఇదంతా తెలిసినా ఇంకా అక్కడే ఉండటం వెనుక ఒకే ఒక్క కారణం ఉద్యోగం రాకపోతుందా అన్నా చిరుఆశ. ఒకేఒక్క చిన్న ఆశతో విదేశాలలో బతుకుతున్నారు. ఇట్టి విశయాలు తల్లిదండ్రులకు పూర్తి గా తెలియకుండా కొన్ని నిజాలు దాచిపెట్టి పిల్లలు అక్కడ ఉంటున్నారు. అయితే సోషల్ మీడియా ,టీవీ, పత్రికలు విదేశాలలో విద్యార్థులు, విదేశీయులు పడుతున్న వెతలు కళ్ళకు కట్టినట్టు చూపిస్తున్నారు. టీవీలు అదేపనిగా ఇట్టి వీషయాలపై ఊదరగొట్టి తల్లిదండ్రులను గందరగోళంగా ప్రశాంతంగా ఇక్కడ పిల్లల తల్లిదండ్రులు ఉండలేక పోతున్నారు. దీని వలన తమ పిల్లలు ఎలా ఉన్నారో ,ఏలాంటి అగాయిత్యాలకు పాల్పడతారో,ఏ సంఘ విద్రోహ శక్తుల బారినపడి తమ పిల్లలకు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందో, పిల్లలు మానసిక వత్తిడికి లోనై చెడుఅలవాట్లకు బానిసలుఅవుతాడో అని తమ కొడుకు పై ఉహాజనితంగా నాకొడుకు ఎక్కడ చెడిపోతాడోఅని మానసికంగా తల్లిదండ్రులు ఒత్తిడితో ఉంటున్నారు. బిక్కు బిక్కు మంటు బతుకు జీవుడా అని జీవితం గడుపుతున్న తల్లిదండ్రులు ఎందరో..

పిల్లలు సెటిల్ అవ్వక ,సెటిల్ అయిన పిల్లలు ఉద్యోగ భద్రత లేక పెండ్లిల్లకు దూరంగా ఉంటున్నారు. ఇండియా కీ రాకుండా, పెండ్లి చేసుకొక తాతలు, తాతయ్యాలు అమ్మలు అమ్మమ్మలుగా చూడాలనుకొనే కొందరికి ఆశలు నెరవేరడంలేదు. మావాడు అమేరికా లో ఉన్నాడు అని ఏ ఒక్కరు దైర్యం గా చెప్పుకొనే పరిస్థితి ఈనాడు లేదు.దీనికి కారణాలు ఏమీటి అని తల్లిదండ్రులు, ప్రభుత్వాలు అన్వేషించాలి. ప్రభుత్వాలు కూడ దూరదృష్టితో ప్రణాళికలు రచించాలి.విదేశీ చదువులు నేరంకాదు.కాని అక్కడ చదువు లతో ఇక్కడికి వచ్చి ఉద్యోగం చేసుకొనేలా , స్వతంత్రంగా జీవించే మార్గాలు ప్రభుత్వం అవకాశాలు కల్పించాలి.విదేశీ ప్రమాణాల తో వారి ప్రతిభను మన దేశంలోనే ఉపయోగపడేలా దేశ ప్రగతి కి బాటలు వేసేలా విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహించిన నాడు యువత విదేశీ బాటపట్టకుంటా ఉంటారు. ఒక వేళ్ళ వెళ్ళినా భరోసాగా స్వదేశానికి తిరిగి రావాలి .ఆనమ్మకం ప్రభుత్వం యువతకు కల్పించాలి.మన దేశంలో లోనే యువత భరోసాగా జీవించ గలిగే రోజులు రావాలని ప్రభుత్వాలు ఆదిశగా ఆలోచించాలి అని ఆశీద్దాం....

# రాంపల్లి వద్ద బైక్‌ల ఢీ ఇద్దరి పరిస్థితి విషమం



**అపస్మారక స్థితిలో పడిన గాయపడిన వారిని సకాలంలో స్పందించి రక్షించిన 108 సిబ్బంది**

**నాగారం, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లి గ్రామ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లక్కీ వైన్స్ దగ్గర రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు.ప్రమాద వివరాలు:రాంపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు (64) నాగారం వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా,రాంపల్లి ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న, శ్రీకాకుళం జిల్లా మూలాలు గల కుమార్ (18) బైక్‌పై రాంపల్లి వైపు వస్తున్నాడు. లక్కీ వైన్స్ వద్ద వీరి వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో ఇద్దరూ బైక్‌ల నుండి కింద పడిపోయారు.ఢీకొన్న తీవ్రతతో తలకు గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. 108 అత్యవసర సిబ్బంది స్పందన:ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. కీసర 108 సిబ్బంది ఈ.ఏమ్.టి. చిత్రం రవి, పైలట్ ప్రభాకర్ క్షణాల్లో సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని అంబులెన్స్‌లోకి తీసుకున్నారు.రక్తపోటు పడిపోకుండా గ్లూకోజ్ ద్రవాలు ఎక్కించారు.ఆక్సిజన్ సరఫరా చేస్తూ ప్రాణాపాయ పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తక్షణ వైద్య పరీక్షలు నిర్వహించి వారిని ప్రాణాలతో గాంధీ ఆసుపత్రికి తరలించారు.కుటుంబ సభ్యుల స్పందన:సకాలంలో స్పందించి ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడిన 108 సిబ్బందికి గాయపడిన వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఎవరు ఉన్నా 108 అత్యవసర నంబర్‌కు సమాచారం అందించగానే వేగంగా సాయం అందుతుంది.

# హెచ్-1బి వీసా నిర్ణయం ఆందోళన కలిగిస్తోంది

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు):**



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్-1బి వీసాలకు సంబంధించి జారీ చేసిన తాజా కార్యనిర్వాహక ఉత్తర్వులపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అమెరికాలో పనిచేస్తున్న భారతీయులపై, ముఖ్యంగా టెక్ రంగ నిపుణులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ట్రంప్ ఉత్తర్వులు దిగ్భ్రాంతికరమని, భారత్-అమెరికా దేశాల మధ్య సంబంధాల చరిత్రలో ఇలాంటి చర్యలు ఆమోదయోగ్యం కావని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దశాబ్దాలుగా అమెరికా ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతున్న భారతీయ నైపుణ్యం కలిగిన కార్మికుల ప్రయోజనాలు దెబ్బతినకూడదని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తక్షణం జోక్యం చేసుకోవాలని కోరారు. తెలుగు టెక్ నిపుణులు కూడా పెద్ద ఎత్తున ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య తక్షణమే పరిష్కరించకపోతే భారతీయ నిపుణులు ఊహించని కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు.

# సత్తుపల్లి సింగరేణిలో బొగ్గు రవాణా ఆధునికతలపై సమీక్ష



**డైరెక్టర్ (ఈ & ఎమ్) ఎం. తిరుమల రావు.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ (ఈ & ఎమ్) ఎం. తిరుమల రావు జె.వి.ఆర్. బొగ్గు నిర్వహణ కేంద్రం, సత్తుపల్లి, కొత్తగూడెం ప్రాంతాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన బొగ్గు రవాణా, నిర్వహణ మరియు సాంకేతిక పరిజ్ఞానాలను క్షుణ్ణంగా సమీక్షించారు. ముఖ్యంగా సైలోలో రాపిడ్ లోడింగ్ వ్యవస్థ, డి.ఎఫ్.డి.ఎస్. విధానాలు మరియు విండ్ వ్యారియర్ ప్రగతిని పరిశీలించి, అధికారులకు ముఖ్య సూచనలు అందించారు.

ఎం. తిరుమల రావు ఈ ఆధునిక సాంకేతికతల వల్ల బొగ్గు రవాణాలో సమయం ఆదా, లోడింగ్ సామర్థ్యం పెరుగుదల, అలాగే భద్రతా ప్రమాణాల కచ్చిత నిర్వహణ సాధ్యమవుతుందని అధికారులు తో చర్చించారు. సత్తుపల్లి కేంద్రం సింగరేణి రవాణా లక్ష్యాలను చేరుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

అలాగే, కేంద్రం ప్రారంభం నుండి ఎదురైన సవాళ్లను అధిగమించి, నిరంతరం అద్భుతమైన పనితీరును ప్రదర్శిస్తున్నందుకు జె.వి.ఆర్.సి. హెచ్.పి. అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఈ & ఎమ్) ఎం. తిరుమల రావు తో పాటు జి.ఎం సి.హెచ్.పి.'స్ రామ మూర్తి, జె.వి. ఆర్.ఓ.సి. ప్రాజెక్ట్ అధికారి ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్, ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ రాజు, జె.వి.ఆర్.సి. హెచ్. పి. హెచ్.ఓ.డి. కె.సోమశేఖర రావు, జె.వి.ఆర్.ఓ.సి. ప్రాజెక్ట్ ఇంజనీర్ డి. శ్రీనివాస మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మద్దిగట్ల - మోజర్ల పాఠశాలలో అంబరాన్నంటిన బతుకమ్మ



**పెద్దమందడి,సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రతి తరగతి విద్యార్థినీ విద్యార్థులు బతుకమ్మలు తయారుచేసి గౌరమ్మను పూజించారు. సరస్వతి మాత విగ్రహానికి నూతన వస్త్రాలు సమర్పించి పూలతో అలంకరించి వేడుకలను ఆరంభించారు.

ఈ కార్యక్రమానికి పెద్దమందడి మండల విద్యాధికారి మంజులత ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులతో కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. పది రోజులపాటు జరిగే బతుకమ్మ మరియు దసరా ఉత్సవాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాదరావు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ ప్రత్యేకత, దసరా ఉత్సవాలు జరుపుకునే విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే, దసరా సెలవుల్లో పాఠశాలలో ఇచ్చిన ఇంటిపనులను పూర్తి చేసి పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం,పాల్గొన్న ఉపాధ్యాయ బృందం డి రణదీవ్, పి వెంకటస్వామి, గద్వాల కృష్ణయ్య, భగవంతు, వాణి ప్రభ, పుల్లయ్య, మధుసూదన్, ఏ వెంకటస్వామి, శ్రీనివాసులు, చిన్నారెడ్డి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్





# వికలాంగుల పెన్షన్ సమస్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్తా

## కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ దారుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు సహకారం తమకు పెద్ద బలం అవుతుందని ఆయన పేర్కొన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్), ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వినతిపత్రాల సమర్పణ కార్యక్రమం భాగంగా, మల్కాజిగిరి జిహెచ్ఎంసి కార్యాలయం వద్ద మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వినయ్, ఎంజెఎఫ్ నాయకుడు మనోహర్, పలువురు పెన్షన్ దారులు కలిసి కార్పొరేటర్‌ను కలిశారు.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ :కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే మేనిఫెస్టోలో వికలాంగులకు చేయూత పెన్షన్ పెంపు హామీ ఇచ్చిందని,గత ప్రభుత్వంతో పోలిస్తే ఎక్కువ సాయం అందించాలనే ఉద్దేశ్యంతో ఆ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా నెరవేర్చాలని కోరుతున్నామని,ప్రస్తుతం రాష్ట్రంలో వరదల ప్రభావం, రైతులకు యూరియా అందకపోవడం, కేంద్ర ప్రభుత్వ వైఖరి వంటివి అనేక సమస్యలకు దారితీసి పెన్షన్ అమలులో ఆలస్యానికి కారణమయ్యాయని చెప్పారు.ఈ సమస్యపై తమ మల్కాజిగిరి నాయకుడు మైనపల్లి హనుమంతరావు సహకారంతో త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి దృష్టికి తీసుకెళ్తామని, వికలాంగుల పెన్షన్ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ హామీ ఇచ్చారు.



# అశోక్ దీక్షను విరమించమని విజ్ఞప్తి చేసిన ఎంపీ ఈటల రాజేందర్

**వనస్థలిపురం, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న అశోక్ ను వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – "ప్రాణం మీదకు తెచ్చుకోవద్దు, దీక్ష విరమించాలి. మీకు సంపూర్ణ మద్దతు ఇస్తాం. యువతలో ఆందోళన ఉంది, మనమంతా సమిష్టిగా పోరాడుదాం. మీలాంటి వారిని తెలంగాణ సమాజం పోగొట్టుకోలేదు" అని అశోక్ కు భరోసా ఇచ్చారు.అశోక్ ఆరోగ్యం క్షీణిస్తోందని, క్రియేటినిన్ లెవెల్స్ పెరిగాయని, ఆసుపత్రి సదుపాయాలు సరిగా లేవని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్లకు సహకరించాలని కోరారు.నిరుద్యో

గులపై అన్యాయం: మీడియాతో ఈటల మాట్లాడుతూ –"తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగు లు దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారు. చదువుకోవడానికి ఉద్యమం, ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం ఉద్యమం,పరీక్షలు సరిగా జరగాలని ఉద్యమం, రిజల్ట్స్ కోసం ఉద్యమం, అవకతవకలపై ఉద్యమం, చివరికి కోర్టు కేసుల కోసం ఉద్యమం – ఇలా విద్యార్థుల జీవితమంతా పోరాటాలే" అని అన్నారు.మునుపటి ప్రభుత్వం గ్రూప్ 1 పరీక్ష కోసం 503 పోస్టుల నోటిఫికేషన్ ఇచ్చి, ప్రస్తుత ప్రభుత్వం మరో 64 పోస్టులు చేర్చి కొత్త నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఒకే పరీక్షలో అదనపు పోస్టులు ఎలా వచ్చాయో ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతుందని విమర్శించారు.ఎన్నికల హామీలు విస్మరించారా?"ఆరు నెలలకు ఒక నోటిఫికేషన్, జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు – ఇవన్నీ ఎన్నికల ముందు చేసిన మాటలు. కానీ రెండు సంవత్సరాలు గడిచినా అమలు కాలేదు. రాజకీయాలకు మాత్రమే సమయం ఉన్నా, యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే తపన ఈ ప్రభుత్వానికి లేదు" అని ఈటల అన్నారు.అశోక్ గతంలో కూడా నిరుద్యోగుల కోసం పెద్ద ఉద్యమాలు చేశారని, షుగర్ పేషంట్ అయిన ఆయన ఆరోగ్యం కాపాడుకోవాలని, బ్రతికి ఉండి మరింత పెద్ద ఉద్యమాలు నడపాలని కోరారు. ఆయన భార్యతో కూడా మాట్లాడినట్టు చెప్పారు."అశోక్ వెనుక లక్షలాది నిరుద్యోగ యువత ఉన్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించి ఆయన దీక్ష విరమించేలా ప్రభుత్వం ముందడుగు వేయాలి" అని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

# పాలమూరు–రంగారెడ్డి పై సాంకేతిక అవగాహన లేకుండా మాట్లాడడం సరికాదు

## వనపర్తి ,ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి,సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంపై బీఆర్ఎస్ నాయకులు సాంకేతిక అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేస్తున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు. శనివారం గాంధీభవన్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం 27,360 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరాకు కూడా నీళ్లు అందలేదని దుయ్యబట్టారు.

మొదటి పంపు పనులు పూర్తికాకముందే చివరి పంపు టెండర్లు పిలవడం వారి అవగాహనలేమికి నిదర్శనమని అన్నారు. నార్లపూర్-ఏదుల, వట్టెం, కర్వేనా నిర్మాణాలపై రూ.6,868 కోట్లు ఖర్చు చేసి కేవలం కమిషన్లే వసూలు చేశారని, రైతులకు భూసేకరణ పరిహారం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రస్తుతం పాలమూరు-రంగారెడ్డి పూర్తవ్వాలంటే ప్రస్తుత రేట్ల ప్రకారం రూ.65 వేల కోట్లు అవసరమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రాజెక్టు పనులను స్టేజీవారీగా వేగవంతం చేస్తున్నారని చెప్పారు.

కాళేశ్వరం-పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులపై లక్షల కోట్లు ఖర్చయినా ఒక్క ఎకరానికి నీరందలేదని మేఘారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే ఇప్పటికీ రైతులకు నీరు అందుతోందని గుర్తు చేశారు.

కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడిన ఆయన, "మగోడివైతే మగతనం చూపించమంటున్న కేటీఆర్, రేవంత్ రెడ్డి గారి మగతనం ఏంటో ఇప్పటికే రెండు సార్లు చూశాడు. ఇంకా నమ్మకం లేకపోతే మళ్లీ వస్తే చూపిస్తాం" అని సవాల్ విసిరారు.

గ్రూప్ 1 అభ్యర్థులపై కేటీఆర్ చేసిన విమర్శలు దారుణమని, వనపర్తిలోనే మొదటగా ఫిర్యాదు చేశామని తెలిపారు. అహర్నిశలు కష్టపడి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "కుటుంబంలోనే కలహాలు ఉన్నవారు, ముందు వాటిని పరిష్కరించుకొని ప్రజల ముందుకు రావాలి" అని మేఘారెడ్డి ఎద్దేవా చేశారు.








# నా ఎజెండా అభివృద్ధి మాత్రమే

**స్టేషన్ ఘనపూర్, (తెలంగాణ ముచ్చట్లు):**

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- 21 నెలల్లో 1026 కోట్లు తీసుకువచ్చానని,
- వచ్చే మూడు ఏళ్లలో 2వేల కోట్లు తెస్తానని హామీ
- మళ్లీ పోటీ చేయను,
- నియోజకవర్గ అభివృద్ధికే కట్టుబడి ఉంటానని స్పష్టం

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి వ్యక్తిగత విమర్శలు చేసి రాజకీయాలను దిగజార్చే ప్రయత్నాలు ప్రజలు ఒప్పుకోరన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ఒక్కటే తన ఎజెండా అని, ఇకపై ఎమ్మెల్యేగా పోటీ చేయబోనని ఆయన స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ రైతు వేదికలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 34 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల రూపంలో 34.03 లక్షలు, 38 మందికి సీఎం సహాయనిధి చెక్కుల రూపంలో 15.47 లక్షలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ శ్రీహరి, "నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి, రెవెన్యూ డివిజన్ కార్యాలయం, సీసీ రోడ్లు, ఇళ్ల నిర్మాణం, కాలువ పనులు జరుగుతున్నా కొందరి కళ్లకు కనిపించడం లేదు. నేను ఎవరి దగ్గర తల వంచను, తప్పుడు పనులు చేయను" అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంతో కలసి 21 నెలల్లోనే 1026 కోట్ల అభివృద్ధి నిధులు తెచ్చానని, వాటిని ప్రజల ముందు ఉంచానని తెలిపారు. రాబోయే మూడేళ్లలో మరో 2 వేల కోట్ల అభివృద్ధి నిధులు తెచ్చి నియోజకవర్గానికి చెడ్డపేరు తొలగిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వినూత్న సంక్షేమ పథకాల అమలు వల్ల తెలంగాణ దేశానికి ఆదర్శంగా మారిందని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇళ్ల మంజూర్లు, రైతులకు రుణ మాఫీ, భరోసా వంటి పథకాల ద్వారా ప్రజలకు నేరుగా మేలు కలుగుతోందన్నారు .ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ఏ ఎస్ రావు నగర్ డివిజన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

## ప్రధాని మోడీ జన్మదినం పురస్కరించుకొని సేవాపక్షంలో భాగంగా కార్యక్రమం

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినంను పురస్కరించుకొని సేవాపక్షం లో భాగంగా బిజెపి డాక్టర్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. బిజెపి ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యా నర్సిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – "రక్తదానం జీవదానం... ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలి. యువత రక్తదానం చేయడం ద్వారా సమాజానికి అండగా నిలవాలి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి అంబటి వెంకటాచలం, డివిజన్ ప్రధాన కార్యదర్శులు ఉమ శ్రీధర్, సిద్దూరి సంపత్ రావు, సీనియర్ నాయకులు సోహన్ సింగ్, హేమలత, దొంతుల ప్రభాకర్, రజినీకాంత్ రెడ్డి, రణం సిద్దేశ్వర్, నర్సిరెడ్డి, సందీప్, సోమేష్‌నాయుడు, సాయి ప్రసాద్, దుబ్బాక శ్రీనివాస్, వీర స్వామి, కనకయ్యా, మోనిష తదితరులు పాల్గొన్నారు.




# డా. ఎ. ఎస్. రావు 111వ జయంతి

## చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు కమలానగర్ కార్యాలయంలో పద్మభూషణ్ డాక్టర్ ఎ. ఎస్. రావు 111వ జయంతి వేడుక ఘనంగా జరిగింది. కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు అధ్యక్షత వహించగా, ఈసీఐఎల్ మాజీ అధికారి ఎం. భాస్కర్ రావు, స్ఫూర్తి గ్రూప్ నాయకులు డాక్టర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గొడుగు యాదగిరి రావు మాట్లాడుతూ, పేదరికంలో పెరిగినా విద్యపై ఎనలేని ఆసక్తితో ఉన్నత విద్యను అభ్యసించి, అమెరికాలో చదివినా దేశ భక్తి కారణంగా భారత్‌కు వచ్చి అణుశక్తి రంగంలో విశేష కృషి చేసినవారని డాక్టర్ ఎ. ఎస్. రావు జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. మొట్టమొదటి అణు రియాక్టర్ అప్సర రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశ స్వావలంబన కోసం ఈసీఐఎల్ స్థాపించి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించడమే కాక, పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చారని వివరించారు.ఎం. భాస్కర్ రావు మాట్లాడుతూ, ఈసీఐఎల్ నిర్మాణం దేశానికే గర్వకారణమని, డాక్టర్ రావు నిరాడంబరతతో జీవనం గడిపి అందరికీ స్ఫూర్తిగా నిలిచారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు సృజన, కార్యదర్శి వినోద, కోమటి రవి ప్రసంగించారు. అనంతరం సభికులందరూ డాక్టర్ రావు చిత్రపటానికి పూలు అర్పించి నివాళులర్పించారు.ఈ వేడుకలో ఎం. శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాస్, ఉన్నికిష్టన్, గౌసియా, శారద, వినోద, ఉదయ భాస్కర్, మధు, కళారంగం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కాలువను పునరుద్ధరించిన హైడ్రా

**హైదరాబాద్,సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని కౌకూరు ప్రాంతంలో వరద ముప్పు తప్పడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కౌకూరు కుంట - నాగిరెడ్డి కుంటల మధ్య అనుసంధాన కాలువను హైడ్రా పునరుద్ధరించి ఈ సమస్యకు పరిష్కారం చూపింది. రెండు కుంటలను కలుపుతూ ఉండే కాలువకు అడ్డంగా ప్రహరీ నిర్మించారని ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారులతో హైడ్రా క్షేత్ర స్థాయిలో విచారించింది. కాలువకు అడ్డంగా గోడను నిర్మించారని నిర్ధారించుకున్న వెంటనే హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. అంతే కాకుండా.. దాదాపు 25 మీటర్ల మేర కాలువను హైడ్రా పునరుద్ధరించింది. దీంతో కౌకూరుకుంట నీటితో పాటు.. పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వరద సాఫీగా నాగిరెడ్డి కుంటకు చేరింది. రెండు కుంట మధ్యన ఉన్న ఫార్చ్యూన్ టవర్స్‌తో పాటు.. కౌకూరు గ్రామంలోని పలు నివాసాలకు వరద ముప్పు తప్పింది. ఇటీవల వర్షా లు కురిసినా నీరు నిలవలేదని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. హైడ్రా లాంగ్ లివ్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి మద్దతు తెలిపారు. రెండు కుంటలను కలుపుతూ సాగే వరద నీటి కాలువకు అడ్డంగా నిర్మించిన ప్రహరీని హైడ్రా తొలగించడంతో ఈ ముప్పు తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# జాతీయ రహదారుల పెండింగ్ భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు

ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్-20, తెలంగాణ ముచ్చట్లు:

జాతీయ రహదారుల నిర్మాణాలు అయ్యేలా పెండింగ్ భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి సిఎస్, జాతీయ రహదారుల నిర్మాణ పురోగతిపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ విజయవాడ ఎన్.హెచ్ 65 ఆరు లైన్ల రోడ్డు పనులు, హైదరాబాద్ నుంచి అమరావతి, మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్, హైదరాబాద్ డిండి ఎన్ హెచ్ 765 నాలుగు లైన్ల రోడ్డు, ఎన్.హెచ్ 163 మన్నెగూడ సెక్షన్ 4 లైన్ల రోడ్డు, హైదరాబాద్ మంచిర్యాల కారిడార్ 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడర్ పనులపై సీఎస్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సి.ఎస్. కే.రామకృష్ణా రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పలు జాతీయ రహదారుల నిర్మాణ పనులు భూ సేకరణ ఆలస్యం కావడం వల్ల పురోగతి ఆశించిన స్థాయిలో ఉండటం లేదని, దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నారని తెలిపారు.

నాగపూర్ విజయవాడ ప్రాంతాలను కలుపుతూ వేసే ఎన్.హెచ్.163జి 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే మన రాష్ట్రంలో 278 కి.మీ. వేయాల్సి ఉంటుందని, దీనికి అవసరమైన 1382 హెక్టార్ల భూ సేకరణకు ఇప్పటి వరకు 1184 హెక్టార్ల భూ బదలాయింపు పూర్తి చేశామని అన్నారు. కోర్టు కేసులలో సకాలంలో ప్రభుత్వం తరపున వాదనలు వినిపించి స్టే తొలగిపోయేలా చూడాలని అన్నారు. భూ సేకరణ సంబంధించి పెండింగ్ ఉన్న ఆర్బిట్రేషన్ అవార్డు కేసులు పరిశీలించి త్వరగా డిస్పోజ్ చేయాలని అన్నారు. భూ సేకరణ అంశంలో రైతులను ఒప్పించేందుకు స్థానిక మంత్రివర్యులు, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలని అన్నారు.

జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేసేందుకు నిధులు అందుబాటులో ఉన్నాయని, పెండింగ్ భూసేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి జాతీయ రహదారుల నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చూడాలని సీఎస్ ఆదేశించారు. భూసేకరణ అంశంలో ఉండే చిన్న, చిన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి పనులు త్వరగా జరిగేలా చూడాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్.హెచ్ 163జి పరిధిలో ఖమ్మం జిల్లాలో కోర్టు స్టే ముగిసినందున 12 కిలో మీటర్ల మేర రోడ్డు వేసేందుకు 42 హెక్టార్ల భూ సేకరణ వేగవంతంగా పూర్తి చేసి, అక్టోబర్ చివరి నాటికి ఎన్.హెచ్.ఏ. కు భూ బదలాయింపు చేస్తామని అన్నారు. కొదుమూరులో పెండింగ్ ఉన్న 7.39 హెక్టార్ల భూ బదలాయింపు రాబోయే 10 రోజులలో పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు.

ఈ సమావేశంలో నేషనల్ హైవే పి.డి.లు రామాంజనేయ రెడ్డి, దివ్య, ఈఈ యుగేందర్, భూగర్భ,గనుల సహాయ సంచాలకులు ఆర్.సాయినాథ్, కలెక్టరేట్ భూ సేకరణ విభాగం సెక్షన్ అధికారులు, ఇంజనీరింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఒక్కొక్కరికి రెండు బతుకమ్మ చీరలు పంపిణీ

- బతుకమ్మ పండుగకు 'అక్కా-చెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక'
- స్వయం సహాయక సంఘాల మహిళలకు డబుల్ చీరలు

బతుకమ్మ పండుగ సమీపిస్తున్న వేళ మహిళలకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా 'అక్కాచెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక' పేరిట చేనేత చీరల పంపిణీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అవుతోంది. ఈ నెల 21వ తేదీ నుంచి తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగ సంబురాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం ఒక్కో మహిళకు ఒక చీర కానుకగా ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రభుత్వం అందుకు భిన్నంగా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు రెండు చొప్పున ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. మెప్మా ద్వారా నగరపాలక, పురపాలక సంఘాల పరిధిలోని సభ్యుల వివరాలు, డీఆర్డీవో ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాంతాల్లోని సభ్యుల వివరాలు సేకరించాలని పీడీలకు ఆదేశాలు జారీ చేసింది. మెదక్ జిల్లాలోని 21 మండలాల్లో 13,256 సంఘాలు, పురపాలికల్లో 2 వేల గ్రూపులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సంఘాల్లోని సభ్యులు కలిపి మొత్తం 1.58 లక్షల వరకు ఉన్నారు. వీరికి 12 రకాల చీరలను పంపిణీ చేయనున్నారు. త్వరలో చీరలు జిల్లాకు చేరే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. మెదక్, చేగుంట, నర్సాపూర్, అల్లాదుర్గంలోని గోదాముల్లో చీరలను నిల్వ ఉంచి, మండలాలు, పట్టణాలకు చేర్చాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గతానికి భిన్నంగా చీరలను తయారు చేయించారని అధికారులు తెలిపారు. డీఆర్డీఓ, మెప్మా సంఘాలకు కలిపి జిల్లాకు త్వరలో చీరలు రానున్నాయని మెప్మా పీడీ హన్మంత్ వెల్లడిరచారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 1,13,670 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు. వీళ్లందరికీ రెండేసి చీరలు ఇవ్వాలి. జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాలో 3,39,110 మంది ఉన్నారు. వీరి కోసం 6,78,220 చీరలు అవసరం. ఉమ్మడి జిల్లాలో 9,05,560 చీరలు పంపిణీ చేయాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంఘాల ద్వారా పంపిణీ చేయనున్నారు. ఒకేసారి ఇంత స్థాయిలో పంపిణీ చేస్తుందా? కొంత మందికే ఇచ్చి మిగతావారికి దసరా నాటికి చేరవేస్తారా? అనేది చూడాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి బతుకమ్మ చీరలను పంపిణీ చేయనుంది. అయితే గత ప్రభుత్వంలో ఆధార్ కార్డులున్న ప్రతి మహిళకు చీరలను బతుకమ్మ కానుకగా ఇచ్చేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు మాత్రమే చీరలను ఇవ్వాలని నిర్ణయించింది.









# ఫ్యాషన్ డిజైన్ రంగం అభివృద్ధి – విద్యార్థులకు శుభాకాంక్షలు

నాగోల్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):

నాగోల్‌లో జరిగిన ఫ్యాషన్ డిజైన్ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ మాట్లాడుతూ –"మాలాంటి వారికి ఫ్యాషన్ డిజైన్ మర్చిపోయి 25 సంవత్సరాలు అవుతుంది. తెల్ల బట్టలు తప్ప ఇంకేమీ వేసుకోకపోయినా, కాలమంతా ఫ్యాషన్ డిజైనింగ్ గురించే సాగుతోంది. ఒకప్పుడు కొంతమందికే పరిమితమైన ఈ రంగం, ఈ రోజుల్లో పల్లెటూర్ల వరకు విస్తరించడం అభినందనీయం" అని అన్నారు.అలాగే ఆయన మాట్లాడుతూ –"ప్రతి రంగంలో లాగే వ్యాల్యూ యాడెడ్ సర్వీసులు ఉన్నట్లే, ఫ్యాషన్ డిజైనింగ్ కూడా సమాజానికి విలువ చేకూర్చే రంగం. మూడు సంవత్సరాల పాటు కృషి చేసి విద్యను పూర్తిచేసిన విద్యార్థులు ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా రావడం గర్వకారణం. ఈ ఫ్యాషన్ డిజైనర్‌లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులందరికీ అభినందనలు తెలియజేయాలి. మీ సేవలు ప్రజలను సంతోషపరచే విధంగా ఉండాలని, మీరందరూ మంచి అభివృద్ధి సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ, కొత్త ట్రెండ్స్‌ను ప్రజలకు అందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# రాజకీయాల్లో ఎవరూ స్పేస్ ఇవ్వరు

- కాంగ్రెస్ లోకి వెళ్లే ఆలోచన తనకు లేదని స్పష్టత
- చింతమడకలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటానని వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు):

రాజకీయాల్లో ఎవరూ ఎవరికీ చోటివ్వరని, తొక్కుకుంటూ ముందుకు వెళ్లాల్సిందేనని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కొత్త పార్టీ ఏర్పాటు విషయమై ఇంకా ఆలోచించలేదని చెప్పారు. కాంగ్రెస్ లోకి వెళతారన్న ప్రచారాన్ని కవిత తిప్పికొట్టారు. తనకు ఆ ఆలోచనే లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ పెద్దలు ఎవరూ తనను సంప్రదించలేదని తేల్చిచెప్పారు. హరీశ్ రావుతో విభేదాలపై స్పందిస్తూ.. కాళేశ్వరం అంశంలో తప్ప హరీశ్ రావుపై తనకెలాంటి కోపంలేదన్నారు. నీటిపారుదల శాఖలో ఫైళ్లు నేరుగా ముఖ్యమంత్రి వద్దకే వెళుతున్నాయని 2016లోనే తాను కేటీఆర్ కు సూచించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ, హరీశ్‌రావు, సంతోష్ సోషల్ మీడియాలు తనపై చేస్తున్న దాడిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కాగా, ఆదివారం చింతమడకలో జరిగే బతుకమ్మ వేడుకలకు తాను హాజరవుతానని కవిత తెలిపారు. ఆల్మట్టి ఆనకట్ట పెంపు విషయంలో కర్ణాటక ప్రభుత్వ తీరుపై కవిత మండిపడ్డారు. సుప్రీంకోర్టు స్టే విధించినా అక్కడి సర్కారు లెక్కచేయడంలేదని విమర్శించారు. కర్ణాటకను అడ్డుకోకుంటే కృష్ణా నదిలో నీటి చుక్క కూడా మిగలదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఆల్మట్టిపై వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. లేదంటే జాగృతి తరఫున తామే అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోకపోతే నిరసనలు తెలుపుతామని ప్రభుత్వాన్ని కవిత హెచ్చరించారు.



# ఓటుచోరీ అంటూ రాహుల్ గాంధీ అసత్యాలు ప్రసారం

- బోగస్ ఓట్ల ను రాహుల్ గాంధీ ఓటు చోరీ అని అంటున్నారు
- జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే రేవంత్‌రెడ్డి అమలు చేయాలి

హైదరాబాద్,సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు):

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ అంశంపై హైడ్రోజన్ బాంబు వేస్తామంటే తాము భయపడ్డామని.. కానీ పేలని తుస్సు బాంబ్‌లేశారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు ఎద్దేవా చేశారు. ఓటుచోరీ అంటూ రాహుల్ గాంధీ అసత్యాలు ప్రసారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగం చాలా గొప్పదని ఉద్ఘాటించారు. రాజ్యాంగమే మనల్ని కాపాడుతోందని నొక్కిచెప్పారు. ఓటు చోరీ అంటూ ప్రజలను రాహుల్ గాంధీ భయపెడుతున్నారని మండిపడ్డారు రామచందర్ రావు. ఇవాళ(శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో రామచందర్ రావు చిట్‌చాట్ చేశారు. బోగస్ ఓట్ల ను కూడా రాహుల్ గాంధీ ఓటు చోరీ అని అంటున్నారని ఫైర్ అయ్యారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా ఒక వ్యక్తిని ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతంలో యాడ్ చేస్తే ఓటు చోరీ అని అంటారని చెప్పుకొచ్చారు. తాము కూడా తెలంగాణలో ఓటు చోరీపై చాలా సార్లు ఎలక్షన్ కమిషన్‌ను కలిశామని గుర్తుచేశారు. ఇలాంటి చిన్న విషయం కూడా తెలుసుకోకుండా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బోగస్ ఓట్లు వేరు, ఓటు చోరీ వేరని స్పష్టం చేశారు. ఎలక్షన్ ఓటరు లిస్ట్‌లో డిలీట్ చేయాల్సినవి చాలా ఉన్నాయని గుర్తుచేశారు. డిలీట్ చేయమని దరఖాస్తు చేస్తే.. విచారణ చేసి డిలీట్ చేస్తారని తెలిపారు రామచందర్ రావు.

`జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం...



తెలంగాణలో 13 ఏళ్ల నుంచి గ్రూప్ వన్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో అధికారుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోందని తెలిపారు. జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఉస్మానియాకి వెళ్లిన రేవంత్‌రెడ్డి రూ.1000 కోట్లు ఇస్తానని చెప్పారని గుర్తుచేశారు. మెస్ బిల్లులు, హాస్టల్స్ మెయింటనెన్స్ లేక విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే రేవంత్‌రెడ్డి అమలు చేయాలని.. కానీ ప్రతిసారీ కేంద్ర ప్రభుత్వం మీద విమర్శలు చేయొద్దని హితవు పలికారు. పాకిస్థాన్, భారతదేశం మధ్య జరిగిన యుద్ధంలో ఎన్ని విమానాలు కూలిపోయాయో చెప్పామంటే ఎలా సాధ్యమని రామచందర్ రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in